

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 10-05-2025 | సంపుటి - 24 | సంచిక - 08 | రూ : 4 | పేజీలు: 8


## అగ్నివీరుడా వందనం

- యుద్ధ క్షేత్రంలో నేలరాలిన తెలుగుబిడ్డ
- ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌పై పోరాటం
- జమ్మూ కశ్మీర్‌లో అమరుడైన మురళీనాయక్
- శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాలో

2లో



## మాది టీ20 నమూనా

- తెలంగాణను చైనా ప్లస్‌గా తీర్చిదిద్దుతున్నాం
- విధానాల రూపకల్పన, అమలులో వేగంగా పనిచేస్తున్నాం
- రాష్ట్రాన్ని ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- ఈ మేరకు దక్షిణాదికి ఊతమిచ్చేలా లోక్‌సభలో స్థానాలుండాలి
- 'ది హిందూ' సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**మే 9, హైదరాబాద్:** "అమెరికా, చైనాల మధ్య పన్నుల యుద్ధాన్ని మనం చూస్తున్నాం. ఈ సమయంలో తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా అన్ని రకాల ఉత్పత్తులను ఇక్కడే తయారయ్యేలా ప్రణాళికలు రూపొందించాం. చైనా ప్లస్‌గా తెలంగాణను

తరువాయి 2లో

## విషసర్పం.. తుర్కియే...

- ఆ దేశం డ్రోన్లనే భారత్‌పై ప్రయోగిస్తున్న పాకిస్థాన్
- ధ్రువీకరించిన ఫోరెన్సిక్ నిపుణులు

**మే 9 :** చేసిన సాయానికి కృతజ్ఞత చూపక పోయినా పర్వాలేదు. ద్రోహం చేస్తే..! ఇప్పుడదే పని తుర్కియే చేస్తోంది. 2023లో ఆ దేశంలో భారీ భూకంపం సంభవించినపుడు సాయం ప్రకటించిన తొలి దేశం భారత్. 'ఆపరేషన్ దోస్త్' పేరిట భారీగా మానవతా సాయాన్ని అందించింది. బాధితులకు ఆహారం, మందులు సరఫరా

తరువాయి 2లో





## జులైలోగా హంద్రీనీవా విస్తరణ

- ఆ నెల 10న నేనే వచ్చి నీరు విడుదల చేస్తా
- ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమలో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు
- సీఎం చంద్రబాబు వెల్లడి

**మే 9, ఉరవకొండ:** హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు సాకారమైతే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు విస్తరణ పనులను జులైలోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. 770 కిలోమీటర్ల పొడవుతో ఆసియాలోనే అతి పెద్దదైన హంద్రీ నీవాకు ఎన్టీఆర్ శ్రీకారం చుడితే.. తాను ముందుకు తీసుకెళ్లానన్నారు. గతంలో బచావత్ అవార్డు కింద కేటాయింపులున్న ప్రాంతానికి మాత్రమే నీరు అందించేవారని.. మిగులు జలాలు వాడుకునే హక్కును గుర్తించి హంద్రీ నీవా, గాలేరునగరి పథకాలకు శ్రీకారం చుట్టింది తెదేపానే అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి శుక్రవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ పరిధి లోని వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద హంద్రీ నీవా విస్తరణ పనులను పరిశీలించారు. అక్కడే ప్రజావేదికపై మాట్లాడారు. 'ఒకప్పుడు అనంతపురం జిల్లాలో వేరుసెనగ తప్ప మరో పంట కనిపించేది కాదు. 10 సార్లు పంట పెడితే రెండుసార్లే చేతికొ చ్చేది. అలాంటి పరిస్థితుల్లో మొట్టమొదటగా తెదేపా ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించింది. డ్రిప్ విధానం తీసుకొచ్చాక చాలామంది రైతులు ఉద్యాన పంటల సాగులో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు.

తరువాయి 2లో

## జర్నలిస్టులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మే 9, నాంపల్లి, :** అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన విలేకరులు, వృత్తి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న వారిని ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ

తరువాయి 2లో

## పోరు కొనసాగితే... పాక్ గుల్లే!

- ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలతో సతమతం
- యుద్ధంతో పూర్తిగా దివాలా తీయనున్న దాయాది

2లో



## పాక్‌కు మళ్లీ భంగపాటు

- 26 ప్రాంతాల్లో డ్రోన్ దాడుల్ని తిప్పికొట్టిన భారత్
- విమానాశ్రయాలు, సైనిక కేంద్రాలపై ప్రయోగించినవి నిర్వీర్యం
- శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్, అవంతీపోరా ఎయిర్‌బేస్ సురక్షితం
- మూడోరోజూ దద్దరిల్లిన సరిహద్దు
- పంజాబ్, కశ్మీర్‌లలోని నగరాల్లో బ్లాకౌట్
- చొరబాట్లకు యత్నించిన ఏడుగురు ఉగ్రవాదుల హతం
- ప్రాదేశిక సైన్యం సేవల వినియోగానికి అనుమతి
- త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ
- భద్రతపై అమిత్ షా, రాజ్‌నాథ్ సమీక్షలు
- సరిహద్దు గ్రామాల జనం ఇళ్లలోనే ఉండాలని ఆదేశాలు
- పాక్ మనపైకి పంపిన 300-400 డ్రోన్లు తుర్కియే దేశానివే
- పౌర విమానాలే రక్షణ కవచంగా పాక్ దుశ్చర్యలు



2లో

# పాక్‌కు మళ్లీ భంగపాటు...

**జమ్మూ/శ్రీనగర్, దిల్లీ :** దాయాది దేశం పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. రెండు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో శుక్రవారం పగటిపూట కాస్త ప్రశాంతత నెలకొన్నా చీకటి చిక్కబడిన తర్వాత మరోసారి భారత్‌పై దుస్సాహసానికి ఒడిగట్టింది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాలపైకి వరసగా డ్రోన్లు పంపింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని పంపిన డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా నిర్వీర్యం చేసి సత్తా చాటుకుంది. డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడాలనే ప్రయత్నాన్ని గురువారమే సైన్యం తిప్పికొట్టగా ఏమాత్రం బుద్ధిమారని పాక్ మరోసారి విఫలయత్నం చేసి, చేతులు కాల్చుకుంది. జమ్మూ, ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించింది. బారాముల్లా జిల్లాలో పాక్ డ్రోన్లను సైన్యం పేల్చివేస్తుంటే ఆకాశమంతా వెలుగులు కనిపించాయి. సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబు పేలుళ్లు వినిపించడంతో అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. ఆ మేరకు ప్రజలకు సూచనలు జారీ అయ్యాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి జమ్మూ, సాంబ జిల్లాల్లో ఫిరంగులతో భారీగా శత్రుమూకలు విరుచుకుపడ్డాయి. వాటితోపాటు పఠాన్‌కోట్, ఉధంపుర్, నగ్రోటా, జైసల్మేర్, అఖ్నూర్ ప్రాంతాలపైకి పాక్ పంపిన 50 డ్రోన్లను భారత ఆర్మీ కూల్చేసింది. శ్రీనగర్ ప్రజలకు ముందు జాగ్రత్తలు చెప్పడానికి మసీదుల్లోని లౌడ్ స్పీకర్లను వాడాల్సి వచ్చింది. జమ్మూ డివిజన్ ఉధంపుర్‌లో పూర్తిగా బ్లాక్‌అవుట్ పాటించారు. ఆ ప్రాంతంలో భారీగా సైరన్ శబ్దాలు వినిపిస్తున్నాయి. జమ్మూ, అఖ్నూర్, జైసల్మేర్, హరియాణాలోని అంబాలా, పంచ్‌కుల, పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్, అమృత్‌సర్, హోశియార్‌పుర్, మోగా, జలంధర్, ఫజిల్కా సహా పలు సరిహద్దు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

### అటువైపు భారీ నష్టం?

పుంఛ్, రాజౌరీ, ఉరీ సెక్టార్లలో దాడుల్ని భారత సైన్యం తిప్పికొట్టినప్పుడు పాక్‌కు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని తెలుస్తోంది. మరో సరిహద్దు రాష్ట్రమైన రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో గగనతల దాడులకు పలుమార్లు హెచ్చరికలు జారీ అయ్యాయి. పాక్ నుంచి వస్తున్న డ్రోన్లను గాల్లోనే మన వ్యవస్థలు పేల్చేశాయి. పోఖ్రాన్‌లోనూ సైరన్లు మోగించి విద్యుత్తు నిలిపేశారు. జోధ్‌పుర్, బాడ్‌మేడ్, శ్రీగంగానగర్ వంటిచోట్లా పూర్తిగా చీకట్లు అలముకున్నాయి. ఈ రాష్ట్రంలోని ఐదు సైనిక స్థావరాలపై పాక్ దృష్టి పడటంతో అత్యంత అప్రమత్తత ప్రకటించారు. కశ్మీర్ లోయలోనూ బ్లాకౌట్ పాటించారు. ఇళ్లలోనే ఉండాలని, లైట్లు ఆపేయాలని పోలీసులు సూచించారు. జమ్మూలో, దక్షిణ కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. జమ్మూ, సాంబా, పఠాన్‌కోట్ జిల్లాల్లో డ్రోన్లను గుర్తించి కూల్చివేసినట్లు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఉధంపుర్, నగ్రోటాల్లోనూ డ్రోన్లకు ఇదే గతి పట్టించారు.

### దీటుగా బదులిచ్చాం

చీకట్లో దొంగదెబ్బ కొట్టడానికి పాకిస్థాన్ గురువారం రాత్రి వేర్వేరు రూపాల్లో చేసిన అన్ని ప్రయత్నాలకు దీటుగా జవాబిచ్చినట్లు భారత సైన్యం ప్రకటించింది. పశ్చిమ సరిహద్దులో డ్రోన్లు, మందుగుండు సామగ్రితో విరుచుకుపడిన పాక్‌కు తగిన రీతిలో సమాధానం లభించిందని తెలిపింది. జమ్మూలో పాక్ సరిహద్దు ద్వారా మన దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఏడుగురు ఉగ్రవాదుల్ని సైన్యం మట్టుబెట్టింది. పాక్ ప్రయోగించిన ఫిరంగి గుళ్ల వల్ల పుంఛ్ జిల్లాలో ఒక పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. పెద్దశబ్దాలతో పేలుళ్లు సంభవించగా వెంటనే సైరన్లు మోగించి, విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. విమానాశ్రయాలు, కీలకమైన ప్రాంతాల్లో భద్రతను మరింత పెంచారు. అత్యవసర వ్యవస్థల పనితీరును కేంద్రం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. అవసరమైతే ప్రాదేశిక సైన్యం (టీఏ) సేవల్ని వినియోగించుకునేందుకు కేంద్ర సర్కారు అనుమతి మంజూరు చేసింది. రాష్ట్రాల్లో, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఆస్తులకు, ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా మరిన్ని చర్యలు తీసుకున్నారు. ప్రజలు తమ ఇళ్లలోనే ఉండాలని, బాల్కనీల్లోకి రావద్దని చండీగఢ్‌లో సైరన్లు మోగించారు. దిల్లీలో పలుచోట్ల సైరన్లతో హెచ్చరించే వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో కనీసం 24 విమానాశ్రయాల్లో ఈ నెల 15 వరకు పౌరవిమాన సర్వీసుల రాకపోకలను నిలిపివేశారు. చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లుధియానా, భుంటార్, కిషన్‌గఢ్, పటియాలా, శిమ్లా, ధర్మశాల, బఠిండా, జైసల్మేర్, జోధ్‌పుర్, లేహ్, బీకానేర్, పఠాన్‌కోట్, జమ్మూ, జామ్‌నగర్, రాజ్‌కోట్, భుజ్ తదితర విమానాశ్రయాలను మూసివేసినట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘా పెంచారు. బాంబు నిర్వీర్యక దళాలతో తనిఖీలు కొనసాగుతున్నాయి.

# జులైలోగా హంద్రీనీవా విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడి రైతులకు నీరందిస్తే బంగారం పండించగలరు. అందుకే హంద్రీ నీవాకు అత్యంత ప్రాధాన్యమిచ్చి, బడ్జెట్‌లో నిధులు కేటాయించాం. మొదటి ఫేజ్‌లో 10 మీటర్ల నుంచి 16.5 మీటర్లకు వెడల్పు చేయడంతో పాటు రెండో ఫేజ్‌లో లైనింగ్ చేపట్టాం. వెడల్పు, విస్తరణ కారణంగా కాలువ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరుగుతుంది. 5 నెలల్లో పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. వచ్చే నెలాఖరుకు మొదటి దశ పనులు పూర్తి చేస్తాం. జులై 10న మళ్లీ నేనే వచ్చి నీరు విడుదల చేస్తా. దీంతోపాటు సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి నీటిని రాయలసీమకు తరలించేందుకు పోలవరం బనకచర్ల ప్రాజెక్టు చేపడతాం. దీనికి రూ.81 వేల కోట్లు అవసరం. అయినా వెనకడుగు వేయకుండా ముందుకెళ్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

### రూ.3,873 కోట్లతో పనులు

హంద్రీ నీవాలో 554 కి.మీ. మేర లైనింగ్, వెడల్పు పనులకు మొత్తం రూ.3,873 కోట్లు కేటాయించినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫేజ్ 1లో రూ.696 కోట్లు, ఫేజ్ 2లో రూ.1,256 కోట్లతో పనులు చేపట్టామన్నారు. పుంగనూరు బ్రాంచ్ కాలువకు రూ.480 కోట్లు, కుప్పం బ్రాంచ్ కాలువకు రూ.197 కోట్లు కేటాయించి పనులు చేపట్టామన్నారు. పనులు పూర్తయితే ఫేజ్ 1లో కర్నూలు జిల్లాలో 77,094 ఎకరాలు, నంద్యాలలో 2,906 ఎకరాలు, అనంతపురంలో 1.18 లక్షల ఎకరాలు, ఫేజ్ 2లో అనంతపురం జిల్లాలో 33,617 ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 1.93 లక్షల ఎకరాలు, వైఎస్సార్ జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరులో 1.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. మొత్తంగా 6.02 లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో హంద్రీ నీవాకు రూపాయి కూడా ఖర్చు చేయలేదని సీఎం విమర్శించారు. అభివృద్ధితో పాటు పెద్దఎత్తున సంక్షేమం అందిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. 63 లక్షల మందికి రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. పింఛన్లకే ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. దీపం పథకం కింద 3 సిలిండర్లు ఇస్తున్నామని.. సిలిండర్లకు బదులుగా ఖాతాలో నగదు జమ చేసే ఆలోచనలో ఉన్నామని చంద్రబాబు వెల్లడించారు.

# అర్హులైన జర్నలిస్టులకు త్వరలో ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

రూపొందిస్తామని వెల్లడించారు. విధి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలవారీ పెన్షన్; అనారోగ్యం, ప్రమాదాలకు గురై అచేతన స్థితిలో ఉన్న వారికి మంత్రి శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని మీడియా అకాడమీ కార్యాలయంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన తెలంగాణ మీడియా అకాడమీ భవనానికి మరమ్మతులు పూర్తిచేసి ఈ నెలాఖర్లోగా ప్రారంభిస్తామని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీని వారి సంక్షేమానికి అకాడమీ ఖర్చుపెడుతుందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1 లక్ష ఆర్థిక సహాయంతోపాటు 5 ఏళ్ల వరకూ నెలకు రూ.3వేల చొప్పున పెన్షన్ అందజేస్తున్నామని చెప్పారు. వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద 1 నుంచి 10వ వరకు చదివే వారికి నెలకు రూ.1000 చొప్పున గరిష్ఠంగా ఇద్దరికి అందిస్తున్నామన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, పలువురు పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# పోరు కొనసాగితే... పాక్ గుల్లే!

భారత్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త వాతావరణం పాకిస్థాన్‌ను ఆర్థికంగా కుదేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ ఆర్థిక రేటింగ్స్ ఏజన్సీ మూడీ అంచనాల ప్రకారం యుద్ధాన్ని భరించే పరిస్థితి పాక్‌కు ఏ మాత్రం లేదు. అంతర్గత ఖజానా పూర్తిగా ఖాళీఅయి చాలాకాలమైంది. ఆహార పదార్థాల నుంచి పెట్రోలు వరకూ అనేక నిత్యావసరాలకు దిగుమతులపైనే ఆధార పడే ఆ దేశానికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు చాలా అవసరం. అవిప్పుడు దాదాపు నిండుకున్నాయి. ప్రస్తుతమున్న నిల్వలు మూడు నెలల దిగుమతులకు మాత్రమే సరిపోతాయి. యుద్ధం నేపథ్యంలో అదనపు వనరులు సమకూర్చుకోవాలి. కానీ పాక్‌ను ఆర్థికంగా ఆదుకోవటానికి ఎవ్వరూ ఇప్పుడు ముందుకు వచ్చేలా లేరు. అంతర్జాతీయ ఆర్థిక వివరాలు అందించే సీఈఐసీ ప్రకారం... డిసెంబరు 2024 నాటికి పాకిస్థాన్ అప్పు 131 బిలియన్ డాలర్లు! తాజాగా అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) ముందు మరోసారి సహాయం కోసం చేయి చాచింది.

### ఆర్థికంగా దివాలా..

పాక్ జీడీపీలో అప్పుల వాటా ఇప్పటికే 75 శాతానికి చేరుకుంది. అప్పుల కుప్పగా ప్రపంచదేశాల్లో ముద్ర పడింది. పేదరికం, నిరుద్యోగం, ఆరోగ్య సేవల లోపం వంటి సామాజిక సమస్యలు ఆ దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. వీటిని ఎదుర్కోవడమే కష్టమైన తరుణంలో యుద్ధ సన్నాహాలు పాక్‌కు అసాధ్యంగా మారనున్నాయి. మరోవైపు బయట నుంచి నిధులు వచ్చే మార్గాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఇప్పటికే ఇతర దేశాల నుంచి తీసుకున్న అప్పులు కొండలా పేరుకుపోవడంతో వాటిని తీర్చేందుకు సతమతమవుతున్న దాయాది దేశం.. యుద్ధం సృష్టించే భారాన్ని మోసే పరిస్థితి లేదు. పరిమిత ఘర్షణలతో కూడిన సైనిక ప్రతిష్టంభన సైతం పాకిస్థాన్‌కు అంతులేని నష్టాన్ని కలిగిస్తుందని అంచనా వేస్తున్నారు. తీవ్ర ద్రవ్యోల్బణంతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్థాన్‌కు ప్రపంచంలోనే అత్యధిక వృద్ధి రేటుతో దూసుకెళుతున్న భారత్‌తో యుద్ధం ఏమాత్రం శ్రేయస్కరం కాదని నిపుణులు చెబుతున్నారు.

### అటు ఇంటిపోరు...

అటు ఆర్థిక ఇబ్బందులకు తోడు... రాజకీయంగా, సామాజికంగా కూడా పాక్‌లో పరిస్థితి అదుపు తప్పుతోంది. బలూచిస్థాన్‌లో జరుగుతున్న వేర్పాటువాద ఉద్యమం ప్రభుత్వానికే కాదు, సైన్యానికీ సవాలు విసురుతోంది. తరచూ జరుగుతున్న దాడులతో అక్కడ అదనపు బలగాలను మోహరించాల్సి వస్తోంది. పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని



అక్కడ వెచ్చిస్తోంది. ఇటీవల జరిగిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్‌తో ఆ ప్రాంతంపై పట్టుకోల్పోయినట్లయింది. అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతోనూ పాక్‌కు పొసగటం లేదు. ఇంకోవైపు సింధ్‌లో ఇండస్ నదిపై కొత్త కాలువల నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయి. ఒకరకంగా అంతర్యుద్ధ పరిస్థితులను పాకిస్థాన్ ఎదుర్కొంటోంది.

### సైనికులకూ అంతంతే...

దేశ భద్రతలో కీలకమైన రక్షణవ్యవస్థ కూడా బలోపేతంగా ఏమీ లేదు. ఆర్థిక, సామాజిక పరిస్థితుల ప్రభావం సైన్యంపైనా పడుతోంది. ఇప్పటికే సరిహద్దుల్లో ఉన్న సైనికులకు సరైన ఆహారం అందడం లేదని గగ్గోలు పెడుతున్నారు. కిరోసిన్, పెట్రోలు వంటివాటినీ అవసరాలకు అందించలేకపోతున్నారు. అరకొర సౌకర్యాలతో భారత్ వంటి శక్తిమంతమైన దేశాన్ని ఎక్కువ రోజులు ఎదుర్కోలేమని పాక్ రక్షణ నిపుణులు తేల్చి చెబుతున్నారు. 14 రోజుల పాటు యుద్ధం కొనసాగిస్తే భారత్ రూ.2.50 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని... పాకిస్థాన్ కూడా ఇదే స్థాయిలో ఆర్థిక వనరులు వినియోగించాల్సి ఉంటుందని ముంబయికి చెందిన థింక్ ట్యాంక్ స్ట్రాటజిక్ ఫోర్‌సైట్ గ్రూప్ విశ్లేషించింది. ఇదే జరిగితే పాక్‌పై కోలుకోలేని భారం పడుతుంది. మరోవైపు ఉద్రికత్తలు పెరిగే కొద్దీ భారత్ కూడా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల దేశ ఆర్థిక సామర్థ్యానికి 3 శాతం నష్టం కలుగుతుందని అంచనా వేస్తున్నారు.

# అగ్నివీరుడా వందనం..

గోరంట్ల: 'ఆపరేషన్ సిందూర్'లో తెలుగుబిడ్డ వీరమరణం పొందారు. సరిహద్దుల్లో దేశమాత కోసం పోరాడుతూ నేలకొరిగాడు. మారుమూల తండాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన మురళీనాయక్ (25)కు చిన్నతనం నుంచి సైన్యంలో చేరాలని కోరిక. అదే మక్కువతో కష్టపడి ఆర్మీలో చేరారు. కొద్దిరోజులుగా జమ్మూ కశ్మీర్ సరిహద్దులో సేవలు అందిస్తూ గురువారం అర్ధరాత్రి పాక్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. మురళి స్వస్థలం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండా. తండ్రి శ్రీరాంనాయక్, తల్లి జ్యోతిబాయి. మురళికి చిన్నతనం నుంచి దేశభక్తి ఎక్కువని.. అందుకే రైల్వేలో వచ్చిన ఉద్యోగాన్ని కూడా వదిలి ఆర్మీలో చేరారని గ్రామస్థులు, బంధువులు తెలిపారు. 2022 డిసెంబరులో గుంటూరులో జరిగిన ఎంపిక ప్రక్రియలో అగ్నివీర్‌గా సెలెక్ట్ అయ్యారు. తొలుత పంజాబ్, అస్సాంలలో పనిచేసినట్లు తండ్రి శ్రీరాంనాయక్ చెప్పారు రెండున్నరేళ్ల సర్వీసు పూర్తికావడంతో మరో ఏడాదిన్నరలో అగ్రిమెంట్ పూర్తి చేసుకుని వస్తాడని కలలుకంటున్న తల్లిదండ్రులు.. మురళి వీరమరణం గురించి తెలిసి దుఃఖసాగరంలో మునిగిపోయారు. తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### ఏకైక సంతానం..

మురళి తల్లిదండ్రులు తమ ఏకైక కుమారుడిని ఉన్నత స్థాయిలో చూడాలని ఆశించారు. ఇందుకోసం ఎన్ని కష్టాలకైనా సిద్ధమై పనుల కోసం ముంబయికి వెళ్లారు. అక్కడ తండ్రి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా, తల్లి ఇళ్లలో పనులు చేస్తున్నారు. మురళిని నాగినాయని చెరువు తండాలో అమ్మమ్మ దగ్గర ఉంచి చదివించారు. మురళి పదో తరగతి వరకు సోమందేపల్లిలో, ఇంటర్మీడియట్, డిగ్రీ అనంతపురంలో పూర్తి చేశారు. శ్రీరాంనాయక్, జ్యోతిబాయి దంపతులు తండాలో మంగళవారం జరిగిన జాతరలో పాల్గొనడానికి ముంబయి నుంచి వచ్చారు. బంధువులు, సన్నిహితులతో ఆనందంగా గడిపారు. అంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చిందని రోదిస్తున్నారు. 'పంజాబ్‌లో పని చేస్తున్నట్లు చెప్పాడే తప్ప జమ్మూ కశ్మీర్‌లో డ్యూటీ అని మాకు చెప్పనేలేదు' అని మురళి తండ్రి శ్రీరాంనాయక్ తెలిపారు. 'గురువారం ఉదయం మాతో వీడియో కాల్ మాట్లాడాడు. తాను బాగున్నానని చెప్పాడు. మేం ఎలా ఉన్నామని అడిగాడు. అంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది' అంటూ బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు.

# విషసర్పం.. తుర్కియే

(మొదటిపేజీ తరువాయి)

చేయడానికి ప్రత్యేకంగా కిసాన్ డ్రోన్లను మోదీ ప్రభుత్వం పంపింది. అప్పుడు మనం మానవత్వాన్ని చూపితే దాన్ని మరిచి ఇప్పుడు భారత్‌పై దాడికి పాకిస్థాన్‌కు డ్రోన్లను పంపింది.

### తొలి నుంచీ ద్వేషమే..!

పాకిస్థాన్ గురువారం భారీస్థాయిలో భారత్‌పై డ్రోన్ దాడులు చేసింది. దాదాపు 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించింది. వాటిని భారత్ కూల్చివేసింది. ఆ శకలాలను ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షించారు. అవన్నీ తుర్కియేకు చెందిన 'అసిస్ గార్డ్ సోనగర్' డ్రోన్లుగా ధ్రువీకరించారు. తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు తొలి నుంచీ భారత్ అంటే విపరీతమైన ద్వేషం. ఆ విషయాన్ని అనేక సందర్భాల్లో ఆయన బహిరంగంగా వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచమంతా ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తున్న సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఎర్డొగాన్ కలిశారు. ఆ దేశానికి వత్తాసు పలికారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించలేదు సరికదా.. మృతి చెందిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి కూడా వ్యక్తం చేయడానికి ఆయన ఇష్టపడలేదు.

### ఓ ప్రణాళిక ప్రకారం..

పహల్గాం ఉగ్రదాడి జరగగానే పాకిస్థాన్‌పై భారత్ దాడి చేస్తుందని తుర్కియే ముందుగానే ఊహించింది. ప్రపంచమంతా భారత్‌కు సంఘీభావం తెలుపుతున్న సమయంలో ఆరు సైనిక విమానాల్లో పాక్‌కు ఆయుధాలను ఎర్డోగాన్ ప్రభుత్వం పంపింది. తుర్కియే సి130ఈ హెర్క్యూలస్ విమానం గత నెల 28న పాకిస్థాన్‌లో దిగిన విషయాన్ని అంతర్జాతీయ గగనతల నిఘా సంస్థలు కూడా గుర్తించాయి. అయితే ఇంధనం నింపుకొనేందుకు తమ యుద్ధ విమానం దిగిందని ప్రకటనిచ్చి తుర్కియే తప్పించుకొనే ప్రయత్నం చేసింది. తర్వాత ఓ యుద్ధనౌకను కూడా కరాచీ నౌకాశ్రయానికి పంపింది. ఇప్పుడు ఆ ఆయుధాలనే భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగిస్తోంది. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించారు.

# మాది టీ 20 నమూనా

(మొదటిపేజీ తరువాయి)

తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఇతర పరిశ్రమల స్థాపనకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. విధానాల రూపకల్పన, అమలులో టీ20 మోడల్‌లో పనిచేస్తున్నాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ది హిందూ' పత్రిక బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో శుక్రవారం ఆయన జూమ్ మాధ్యమం ద్వారా పాల్గొని మాట్లాడారు. ''దావోస్ వేదికగా తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. ఏపీలోని మచిలీపట్నం నుంచి తెలంగాణకు రహదారి నిర్మాణం ద్వారా డ్రైపోర్టుకు శ్రీకారం చుడుతున్నాం. నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మించనున్నాం. గుజరాత్ మోడల్‌కు కాలం చెల్లింది. అది నరేంద్రమోదీ మోడల్ వాట్సప్ యూనివర్సిటీ. అందులో ప్రచారానికే పెద్దపీట వేస్తారు. పనులు చేసి అభివృద్ధిని కళ్ల ముందు నిలపడమే మా మోడల్. కేంద్రం కూడా దీన్ని అనుసరించాల్సిందే. గత ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు తెలంగాణ అభివృద్ధికి తమవంతు కృషిచేశారు. ఇప్పుడు నా వంతుగా ప్రయత్నిస్తున్నా. తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధిని సాధించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం.

### లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గించాలని కుట్ర

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలన్నీ తీవ్రంగా నష్టపోతాయి. ఇప్పుడున్న సీట్ల నిష్పత్తి ప్రాతిపదికన చేసినా మాకు నష్టమే. లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యాన్ని కనిష్ఠానికి తగ్గించాలని కేంద్రం చూస్తోంది. ఒక వ్యక్తి, ఒక పార్టీ శాశ్వతంగా దేశాన్ని పాలించాలన్నది వారి ఆలోచన. దేశ ఆర్థిక వ్యవస్థకు ఏ రాష్ట్రమైతే ఊతమిస్తుందో... ఆ స్థాయిలో దానికి సీట్లను కేటాయించాలి. ఆ లెక్కన దక్షిణాదికి 33% సీట్లను ప్రత్యేకించాలి. అప్పుడే లోక్‌సభలో మా గళం వినిపిస్తుంది. కేసీఆర్ నేతృత్వంలోని భారాస పార్టీ కూడా ఇదే ఆలోచనతో చెన్నై సమావేశానికి హాజరైంది. ముందుగా అన్ని రాజకీయ పార్టీలను ఈ అంశంపై కేంద్రం చర్చకు పిలిచి, ఏ ప్రాతిపదికన నియోజకవర్గ పునర్విభజన చేస్తారనేది చర్చించాలి.

### సామాజిక దృక్కోణాన్ని ఆవిష్కరించే గణన

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే... కులగణన చేపడతామని రాహుల్‌గాంధీ పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. అందుకే తెలంగాణలో కులగణన చేపట్టాం. నిజానికి మేం చేసింది... సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, కుల సర్వే. సామాజిక దృక్కోణాన్ని ఆవిష్కరించడానికి ఇది దోహదపడుతుంది.

# కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల అభివృద్ధి...

* చౌటుప్పల్ లో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ
* కేజీబీవీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన
* మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి.. కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డులో రూ.3.25కోట్ల వ్యయంతో జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అంతకు ముందు చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి నాయకులు ఘన స్వాగతం పలికారు. క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని దామెర గ్రామంలో రూ.23లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీ జూనియర్ కళాశాల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. కేజీబీవీకి కేటాయించిన స్థలాన్ని మరల సర్వే చేయించి, కబ్జా చేసిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని తహసిల్దార్ ను ఆదేశించారు. నాటి నుంచి నేటి వరకు బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్, ఎండి గౌస్, తహసిల్దార్ హరికృష్ణ, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మా గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, పాక చిరంజీవి, సుర్వి శ్రీను, బద్దం పాండు రెడ్డి, కంచర్లకుంట్ల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద కొండూరు పరిధిలోని గ్రామాలకు డాంబర్ రోడ్డు వేయించాలని ఎమ్మెల్యేకు వినతి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామపంచాయతీ పరిధిలోని తమ్మలోనిబావి, నక్కలగూడెం, గుడ్డోనిబావి గ్రామాలకు డాంబర్ రోడ్డు వేయించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకుడు నల్ల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పెద్ద కొండూరు గ్రామపంచాయతీ పరిధిలోని తమ్మలోని బావి, నక్కలగూడెం, గుడ్డోని బావి గ్రామాలకు మట్టిరోడుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల మీదుగా డాంబర్ రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి యాస నరసింహారెడ్డి, నాయకులు ఎడ్ల నవీన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బాలవర్ధన్ రెడ్డి, గూడూరు లక్ష్మారెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

## రామలక్ష్మణపల్లెలో ఈత, తాటి వనాలు దగ్ధం

: జీవనోపాధి కోల్పోయామని గీత కార్మికుల ఆవేదన

: ప్రభుత్వ పరంగా సహాయం అందించండి: గీత కార్మికులు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలం రామ లక్ష్మణ పల్లెలో ఈత, తాటి వనాలు దగ్ధం అయ్యాయి. గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి దగ్గర రైతులు వారి పొలంలోని కోయకాలును అంటించగా, సమీపంలోని ఈత, తాటి వనంకు మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు 300ల వరకు తాటి, ఈత చెట్లు అంటుకున్నాయి. తాటి, ఈత చెట్లకు మంటలు అంటుకోవడంతో తాము జీవనోపాధి కొల్పోయామని స్థానిక కల్లుగీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలను ఇక మీద ఎలా పోషించుకోవాలని తెలియని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు. కల్లు గీతకు ఉపయోగించే మోకులు, కల్లు గీత పని మూట్లు సైతం కాలి బూడిదయ్యాయని గగ్గోలు పెట్టారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు బైరి శ్రీనివాస్ గౌడ్, బండి లక్ష్మణ్ గౌడ్, పొట్టి నర్సా గౌడ్, పొట్టి అంజా గౌడ్, భాస్కర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, రాములు గౌడ్, నర్సాగౌడ్ కోరారు.

## అతివలను వివస్త్రగా నిలబెట్టే వికృత క్రీడ.. అందాల పోటీలు

* ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విశ్వవీధిలో పతివలను వివస్త్రగా నిలబెట్టే వికృత క్రీడా అందాల పోటీలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 16వ వార్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళల నుంచి నూతన సభ్యత్వాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ అందాల పోటీలు తెలంగాణలో నిర్వహించొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో మగ్గుతుంటే అందాల పోటీలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. స్త్రీ ఆత్మ గౌరవాన్ని భంగపరిచే ఈ అందాల పోటీలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉద్యోగంపై దృష్టి పెట్టి కార్మికుల వేతనాలు సరిగ్గా ఇవ్వడంలో చూపించాలనున్నారు. ప్రజల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచే విధంగా ప్రభుత్వాలు పనులు చేపట్టాలని హితవు పలికారు. ప్రభుత్వానికి, ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని అందాల పోటీలను నిర్వహించి బడా పెట్టుబడిదారులకు వ్యాపారాలకు ఉపయోగపడే పోటీలను రేవంత్ రెడ్డి పెడుతున్నారని ఆరోపించారు. మహిళల్లో వాళ్లపై వాళ్లకు ఉన్న ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయే విధంగా పోటీలకు అనుమతించిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు అమలుపరిచి, ప్రజల్లో విశ్వాసాన్ని తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, జిల్లా కమిటీ సభ్యురాలు బత్తుల జయమ్మ, పట్టణ నాయకురాలు చింతల రజిత, యాదమ్మ, సంధ్య, దేవేంద్రమ్మ, పుష్ప, వీణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని ప్రభుత్వరంగ, ప్రైవేట్ పరిశ్రమలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పరిశ్రమల భద్రతాధికారులతో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో పరిశ్రమల యాజమాన్యాలు, భద్రతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.అశ్వాపురం భారజల ఉత్పత్తి కేంద్రం,సారపాక ఐటిసీ, కెటిపిఎస్,బిడిపిఎస్, నోవా లిమిటెడ్ కంపెనీల భద్రతాధికారులు , సంబంధిత పోలీసు అధికారులతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పరిశ్రమలు, కంపెనీలలో ప్రస్తుత భద్రతా ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్న నియమ నిబంధనలను పాటిస్తూ దానికనుగుణంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. అలారం సిస్టమ్ విధానాన్ని తమ కంపెనీల ఉద్యోగులకు, వారి కుటుంబాలకు, చుట్టుప్రక్కల ప్రాంతాల వారికి అర్థమయ్యే విధంగా ప్రాక్టీస్ చేయాలని తెలిపారు.తమ ప్రాంతాల్లోని ప్రతి ప్రదేశంలో సీసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల,కంపెనీల ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద ఇతర వ్యక్తులు లోనికి ప్రవేశించకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.అదేవిధంగా దొంగతనాలు జరగకుండా తమ వంతు నిఘా ఏర్పాటు చేసుకుని పోలీస్ వారికి సహకరించాలని కోరారు. తమ తమ పరిసర ప్రాంతాలలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని సూచించారు.నిషేధిత మావోయిస్టుల కార్యకలాపాల పట్ల కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులకు సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లాలోని పరిశ్రమలు,కంపెనీల వద్ద గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. అత్యవసర సమయంలో ప్రజలు పాటించాల్సిన విషయాలపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో భారజల కేంద్రం కమాండెంట్ అమిత్ కుమార్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,సీఐలు వెంకటేశ్వర్లు,అశోక్ రెడ్డి,ఐటిసీ సెక్యూరిటీ ఆఫీసర్ మనీష్ శర్మ,కెటిపిఎస్ అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్,బిడిపిఎస్ అసిస్టెంట్ కమాండెంట్ తిరుపతి , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ తెల్ల రేషన్ కార్డులు

- టీయూడబ్ల్యూజే వినతిపై మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి హామీ

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ తెల్ల రేషన్ కార్డులను జారీ చేసేందుకు సత్వర చర్యలు చేపడతామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తం కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. దీనస్థితిలో జీవితాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులకు తెల్ల రేషన్ కార్డులను అందించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ శుక్రవారం మంత్రిని కోరారు. గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం జర్నలిస్టులకు తెల్ల రేషన్ కార్డుల జారీకి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ విషయంలో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



కుత్బుల్లాపూర్ , (ప్రజాస్ఫూర్తి) : చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో శ్రీధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తి, శాంతి, రక్షణకు మార్గం అయ్యప్ప శరణమని అన్నారు. అయ్యప్ప స్వామి కరుణా కటాక్షలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. అంతకు ముందు స్థానిక హనుమాన్ దేవాలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు వరద రాజు, శ్రీశైలం యాదవ్, నరేష్, రాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భద్రతకు,సైనిక సహాయ నిధికి 10 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించిన ఎమ్మెల్యే కుమార్తె, కుమారుడు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కుటుంబాలను, బంధాలను బంధుత్వాలను త్యాగం చేసి మనల్ని రక్షిస్తున్న సైనికులకు మనం ఎంత ఇచ్చినా రుణం తీర్చుకోలేమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమార్తె మాధవరం శ్రీలత, కుమారుడు మాధవరం సందీప్ రావులు అన్నారు. పాకిస్థాన్ పై భారత్ చేస్తున్న ధర్మ యుద్ధానికి మద్దతు తెలుపుతూ సైనికులకు అండగా ఉండేందుకు తమ వంతు సహాయంగా రూ.10 లక్షలు లను సైనిక సంక్షేమానికి అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సమయంలో దేశ ప్రతి పౌరుడు కూడా సైనికులకు , దేశానికి అండగా నిలవాల్సిన సమయం అని, అందుకే తన వంతుగా సైనిక సంక్షేమ నిధికి, ప్రధాన మంత్రి సహాయ నిధికి రూ.10 లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం అవ్వాలని ఉగ్రవాద రూపు రేఖలు సమసిపోయి.. దేశం సుభిక్షంగా శాంతిగా ఉండాలని కోరుకుంటున్నామని వారు అన్నారు.

## ఉత్తమ స్టేషన్ హౌస్ ఆఫీసర్ టి.నరసింహ రాజుకు ఘన సన్మానం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఉత్తమ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా టి.నరసింహ రాజు తెలంగాణ డీజీపీ కార్యాలయం గుర్తింపు గౌరవం లభించిన సందర్భంగా శుక్రవారం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పట్లోళ్ల నాగిరెడ్డి , వెంకటేష్ యాదవ్, తెలుగు వెలుగు దినపత్రిక ప్రతినిధి జగదీష్ , బాల నగర్ పోలీస్ స్టేషన్లో వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ నరసింహ రాజు నిబద్ధత, నిజాయితీ, సేవాభావాలకు ఇంత గొప్ప గుర్తింపు దక్కటం చాలా ఆనందంగా ఉందన్నారు. పోలీసు అంటే ఇలా ఉండాలి అని అనేక కోణాల నుండి ప్రజల చేత మన్ననలు పొంది శభాష్ అనిపించుకున్న ఉత్తమ పోలీసు అధికారిగా బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.నరసింహ రాజు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యుత్తమ 10 మంది పోలీసు అధికారుల్లో బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.నరసింహ రాజు ఒకరు. అయితే సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో మాత్రం బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.నరసింహ రాజు మొదటి స్థానంలో నిలిచారన్నారు. మూడు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ లో పనిచేస్తున్న ఇన్స్పెక్టర్ ల పనితీరుకు సంబంధించి రాష్ట్ర స్థాయి పోలీసు ఉన్నతాధికారులు ప్రజల నుండి క్యూ ఆర్ కోడ్, ప్రజల ఫీడ్ బ్యాక్ లను ఆయా పోలీసు స్టేషన్ ల పరిధిలో బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారుల గురించి వచ్చిన పనితీరును, ఫీడ్ బ్యాక్ లను పోలీసు ఉన్నతాధికారులు ఇటీవలే పరిశీలించారు. గత ఎనిమిది నెలల కాలంలో మూడు కమిషనరేట్ పరిధిలో బాలానగర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ టి.నరసింహ రాజు ప్రజల నుండి ఉత్తమమైన మన్ననలు పొందడంలో మొట్టమొదటి స్థానంలో నిలిచినట్లు తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం ప్రకటించిందన్నారు.

# పిల్లర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

* **జూన్ 15 నాటికి కెనాల్ లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా శుభ్రం చేయాలి..**
* **సీతారామ కాలువల ద్వారా ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయాలి**
* **సీతారామ కెనాల్ పరిశీలనలో రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్ సహకార,చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం లోని సీతారామయ్య ఎత్తిపోతల పథకం అక్విడెక్ట్ ( సూపర్ ప్యాసేజ్ ) కూలిన పిల్లర్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత , జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. పూసుగూడెం నుంచి కమలాపురం పంప్ హౌస్ కు వెళ్లే కాలువ మార్గంలో మాదాపురం దాటిన తర్వాత 48.3 కి. మీ. వద్ద సమీప గుట్టపై నుంచి వచ్చే నీళ్లు కాలువలోకి బదులుగా బయటకు వెళ్లేలా అక్విడెక్ట్ మొత్తం నాలుగు పిల్లర్లతో నిర్మించగా ఒక పిల్లర్ గత నెలలో కూలింది, కూలిన స్థానంలో కొత్త పిల్లర్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు నారాయణ , జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా




మంత్రి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం నాటికి పిల్లర్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జూన్ 15 నాటికి కెనాల్ లో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా ఉన్న గడ్డి, చెట్లను, చెత్తను శుభ్రం చేయాలని, వర్షాకాలం గోదావరికి నీటి ప్రవాహం రాగానే సీతారామ ఎత్తిపోతల ద్వారా సాగర్ కెనాల్ కు నీటిని విడుదల చేయాలని, అప్పుడు నీటి ప్రవాహానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కెనాల్ ను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి సీతారామ కాలువలో ఉన్న మరమ్మత్తులు, మిగిలిన పనులు అన్ని పూర్తి చేసి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. సీతారామ కెనాల్ ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతుందని అన్నారు. వచ్చే వర్షాకాలం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో ఉన్న చిన్న, మధ్యతరహ చెరువులు , ప్రాజెక్టులను నింపడానికి సన్నద్ధంగా ఉండాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు వద్ద ప్యాకేజ్ 9 పనులను మంత్రి పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్సీ రమేష్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ జయలక్ష్మి , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## చందానగర్‌లోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీగా మంటలు

హైదరాబాద్: చందానగర్‌లోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ మంటలు చెలరేగినట్లు సమాచారం. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలు అదుపు చేస్తున్నారు. భారీగా ఎగసిపడుతున్న మంటలు పక్క దుకాణాలకు అంటుకోవడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఏడాది క్రితం కూడా ఇదే షాపింగ్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది.



## శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు అధికారులకు ఈమెయిల్ ద్వారా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నారు. ఇది ఫేక్ బెదిరింపు ఈ మెయిలా? ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పెట్టారనే కోణంలోనూ అధికారులు విచారణ చేస్తున్నారు. మరోవైపు, భారత్ పాక్ సరిహద్దుల్లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేసిన విషయం తెలిసిందే. సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణను పెంచారు. 24 గంటల పాటు డేగ కళ్లతో విమానాశ్రయానికి భద్రత కల్పిస్తున్నారు. స్థానిక శాంతి భద్రతల విభాగం, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల సమన్వయంతో విమానాశ్రయానికి భద్రత కల్పించారు. విమానాశ్రయం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

## మే 11న తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు



హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు అధికారులకు ఈమెయిల్ ద్వారా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నారు. ఇది ఫేక్ బెదిరింపు ఈ మెయిలా? ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పెట్టారనే కోణంలోనూ అధికారులు విచారణ చేస్తున్నారు. మరోవైపు, భారత్ పాక్ సరిహద్దుల్లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేసిన విషయం తెలిసిందే. సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణను పెంచారు. 24 గంటల పాటు డేగ కళ్లతో విమానాశ్రయానికి భద్రత కల్పిస్తున్నారు. స్థానిక శాంతి భద్రతల విభాగం, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల సమన్వయంతో విమానాశ్రయానికి భద్రత కల్పించారు. విమానాశ్రయం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

## నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళాలు ఇద్దాం

### MLAలకు సీఎం రేవంత్ సూచన



హైదరాబాద్: భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పాక్ దుస్సాహసాలపై వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి అండగా నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రతిపాదించారు. ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని సీఎం కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విరాళాన్ని ప్రకటించనున్నారు. మరోవైపు, ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్‌కు మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా..

## ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం

హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన అందాల భామలు నగరానికి చేరుకున్నారు. 'మిస్ వరల్డ్ 2024' విజేతగా నిలిచిన క్రిస్టినా పిస్కోవా (చెక్ రిపబ్లిక్) శుక్రవారం వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న క్రిస్టినాకు తెలంగాణ అధికారులు ఘనస్వాగతం పలికారు. కళాకారులు సంప్రదాయ రీతిలో ఆమెను స్వాగతించారు.



## శ్రీసత్యసాయి జిల్లా జవాను జమ్మూకశ్మీర్‌లో వీరమరణం




గోరంట్ల: శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాను జమ్మూకశ్మీర్‌లో వీరమరణం పొందారు. గోరంట్ల మండలం గడ్డంతండా పంచాయతీ కల్లితండాకు చెందిన మురళీనాయక్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు శుక్రవారం ఉదయం సమాచారం అందింది. సరిహద్దులో చొరబాటు దారుల కాల్పుల్లో ఆయన మృతిచెందినట్లు అధికారులు వారికి తెలిపారు. 2022లో అగ్నివీర్ జవానుగా సైన్యంలో చేరిన మురళీనాయక్.. రెండు రోజుల క్రితం వరకు నాసిక్‌లో విధులు నిర్వర్తించారు. భారత్ పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్మీ అధికారులు ఆయన్ను నాసిక్ నుంచి జమ్మూకశ్మీర్‌కు పిలిపించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున చొరబాటు దారుల కాల్పుల్లో మురళీనాయక్ మరణించారు. ఈ సమాచారం తెలియడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మరోవైపు మురళీ నాయక్ తల్లిదండ్రులను సీఎం చంద్రబాబు ఫోన్‌లో పరామర్శించారు. మంత్రి సవిత కల్లితండాకు వెళ్లి తల్లిదండ్రులను ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5లక్షల చెక్కును మురళీనాయక్ తల్లిదండ్రులకు ఆమె అందజేశారు.

* **తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ దిగ్భ్రాంతి**

దేశ రక్షణలో సైనికుడు మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీనాయక్‌కు నివాళులు అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు, సైనికుడు మురళీ నాయక్ మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఆయన.. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

* **ఆ త్యాగం చరిత్రలో నిలిచిపోతుంది: బండి సంజయ్**

జవాన్ మురళీ నాయక్ మృతి పట్ల కేంద్రమంత్రి బండి సంజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జవాన్ తండ్రి శ్రీరామ్‌తో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చి, ధైర్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మురళీ నాయక్ త్యాగం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మురళీ వీరమరణాన్ని యావత్ భారత్ గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు.

## ఆపరేషన్ సిందూర్ పై కేటీఆర్ స్పందన

పాకిస్థాన్‌తో భారతదేశం పోరాడుతున్న ప్రస్తుత తరుణంలో, దేశ సైన్యానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముందు, కేటీఆర్ మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్, దివంగత నేత రాయల శేషగిరిరావు విగ్రహాన్ని ఆవిష్కరించి, రైతుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు ఇచ్చారు, కానీ జిల్లాకు ఒనగూరిన ప్రయోజనం ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు.



# భానుడి భగభగ... ప్రకాశం జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత

- **ప్రకాశం దరిమడుగులో 42°C, తిరుపతి గంగుడుపల్లెలో 41.3°C**
- **కోనసీమ ఆత్రేయపురంలో 63.7మిమీ, చొప్పెలలో 55మిమీ వర్షపాతం**
- **రేపు 3 మండలాల్లో తీవ్ర వడగాలులు, 23 మండలాల్లో వడగాలులు.**
- **అల్లూరి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పిడుగులతో వర్షా లు.**
- **ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచన**

ఏపీలో కొన్ని జిల్లాల్లో భానుడు ప్రతాపం చూపిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వర్షాలు కురుస్తున్నాయి. నేడు రాష్ట్రంలోని పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవగా, కొన్ని ప్రాంతాల్లో వర్షం పాతం నమోదైంది. రేపు శనివారం కూడా ఇదే తరహా వాతావరణం కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) కీలక సూచనలు జారీ చేసింది. ఇవాళ ప్రకాశం జిల్లా దరిమడుగులో అత్యధికంగా 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, తిరుపతి జిల్లా గంగుడుపల్లెలో 41.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు ఏపీఎస్డీఎంఏ తెలిపింది. మరోవైపు, కొన్ని జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో



అత్యధికంగా 63.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అదే జిల్లా చొప్పెలలో 55 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆకస్మిక వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

**వాతావరణ సూచన**

రేపు శనివారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 43.5 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ అంచనా వేసింది. మూడు మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 23 మండలాల్లో వడగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించింది.అదే సమయంలో, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ పేర్కొంది. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇతర జిల్లాల్లో కూడా చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.



# తిరుమలలో చైనీస్ ఫుడ్ పై నిషేధం.. హోటళ్లకు మార్గదర్శకాలు జారీ!

- **ఆహార నాణ్యతపై భక్తుల నుంచి ఫిర్యాదులు**
- **హోటల్ సిబ్బంది సంప్రదాయ వస్త్రధారణ ధరించాలని టీటీడీ ఆదేశం**
- **ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలన్న అదనపు ఈవో**

తిరుమల క్షేత్రంలో విక్రయించే ఆహార పదార్థాల విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై తిరుమల కొండపై చైనీస్ ఫుడ్ ఐటమ్స్ విక్రయించడంపై శాశ్వతంగా నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. భక్తుల ఆరోగ్యం, ఆహార నాణ్యత దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు టీటీడీ వర్గాలు వెల్లడించాయి. తిరుమలలోని హోటళ్లు, తినుబండారాల శాలల్లో లభించే ఆహార పదార్థాల నాణ్యతపై ఇటీవల భక్తుల నుంచి పలు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి తిరుమలలోని హోటళ్ల యజమానులతో ప్రత్యేకంగా సమా వేశమయ్యారు. ఈ సమావేశంలో భక్తు లకు అందించే ఆహారం విషయంలో పలు ముఖ్యమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ప్రధానంగా చైనీస్ ఫుడ్ అంశం చర్చకు వచ్చింది. ఇకపై తిరుమలలో ఫ్రైడ్ రైస్, నూడుల్స్, మంచూరియా వంటి ఎలాంటి చైనీస్ తరహా ఆహార పదార్థాలను విక్రయించరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని, దీనిని కచ్చితంగా పాటించాలని హోటళ్ల నిర్వాహకులను ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన, శుచి కరమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల అభిరుచులకు అనుగుణంగా వారికి నచ్చిన రీతిలో వైవిధ్యమైన భారతీయ వంటకాలను అందించాలని సూచించారు. ఆహార తయారీలో, హోటళ్ల నిర్వహణలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నొక్కిచెప్పారు. ఆహార నాణ్యతతో పాటు, హోటళ్ల నిర్వహణకు సంబంధించి కూడా అదనపు ఈవో పలు మార్గదర్శకాలను జారీ చేశారు. హోటళ్లలో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా సంప్రదాయాలను గౌరవిస్తూ, అందుకు అనుగుణమైన వస్త్రధారణలోనే విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి హోటల్ వద్ద ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ తదితర ధృవీకరణ పత్రాలను అధికారులకు, భక్తులకు స్పష్టంగా కనిపించేలా ఫ్రేమ్ చేసి ప్రదర్శించాలి చెప్పారు. భక్తుల సౌకర్యార్థం డిజిటల్ చెల్లింపుల విధానాలను అందుబాటులో ఉం చాలని ఆదేశించారు. అన్ని దుకాణాలలో తప్పనిసరిగా ధరల పట్టికను ప్రదర్శించాలని, నిర్దేశిత ధరలకే విక్రయాలు జరపాలని చెప్పారు. హోటల్ నిర్వహణ లైసెన్సులను నిర్ణీత సమ




# చంద్రబాబు దీన్ని ముందుగానే గుర్తించారు

## : పల్లా శ్రీనివాసరావు

- **టీడీపీ రాజకీయ శిక్షణ తరగతులు మూడో రోజు విజయవంతంగా ముగింపు**
- **ముఖ్యఅతిథిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**
- **రాజకీయాలు ప్రజాసేవకేనని, ఆర్థిక లబ్ధి కోసం కాదని పల్లా ఉద్బోధ**
- **ఎన్టీఆర్, చంద్రబాబు ఆశయాలు, సంక్షేమ పథకాల ప్రస్తావన**
- **గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ ఆదేశాల మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా కార్యక్రమం మూడో రోజు విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పార్టీ పొలిటికల్ యాక్షన్ కమిటీ నాయకుడు లక్ష్మణ్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గ నేతలను ఉద్దేశించి పల్లా శ్రీనివాసరావు ప్రసంగించారు. రాజకీయాల్లోకి ప్రవేశించే వారు అధికారం కోసమో, ఆర్థిక ప్రయోజనాల కోసమో కాకుండా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఉండాలని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్రజాసేవనే పరమాత్మ సేవగా భావించే వారే ప్రజల మన్ననలు పొంది, రాజకీయాల్లో చిరస్థాయిగా నిలబడతారని ఆయన పేర్కొన్నారు. 'ప్రజలే దేవుళ్లు, ప్రజాస్వామ్యమే దేవాలయం' అనే నినాదంతో టీడీపీ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత ఎన్టీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి వారి గౌరవాన్ని పెంచిన ఘనత టీడీపీదేనని వివరించారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ, చంద్రబాబు విజన్ 2020తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికి, హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దారని పల్లా కొనియాడారు. ఆయన ముందుచూపు వల్లే నేడు లక్షలాది మంది తెలుగు యువత ఐటీ రంగంలో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కృత్రిమ మేధ (ఏఐ) కీలకం కానుందని, దీనిని కూడా చంద్రబాబు ముందుగానే గుర్తించి 'విజన్ @2047 స్వర్ణాంధ్ర' లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంపై పల్లా శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు చేశారు. కొందరు నాయకులు అబద్ధాలతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టపరిచారని ఆరోపించారు. ప్రకృతి వనరులను దోచుకున్నారని, ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. అందుకే ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పారని, అయినా వారిలో మార్పు రావడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు చట్టం నుండి తప్పించుకోలేరని, చైనా వంటి దేశాల్లో ఆర్థిక నేరగాళ్లకు కఠిన శిక్షలు విధిస్తున్నారని, మన దేశంలో కూడా అలాంటి చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. నాయకుడు ఫలాలతో నిండిన వృక్షంలా ఉంటూ, తన స్వార్థం కాకుండా ఇతరుల ఆకలి తీర్చాలని పల్లా హితవు పలికారు. ఓర్పు, సహనంతో పనిచేస్తే సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, చంద్రబాబు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం, భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసం టీడీపీ శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నైతికంగా తిప్పికొడుతూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ, ప్రజారంజక పాలన అందించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు.

# ఏపీ లిక్కర్ స్కాం కేసులో బిగ్ ట్విస్ట్.. మరో నలుగురికి నోటీసులు

ఏపీ లిక్కర్ స్కామ్ ఆరోపణల కేసులో సిట్ అధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే రాజ్ కసిరెడ్డి సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరో నలుగురికి సిట్ నోటీసులిచ్చింది. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు పనిచేసిన కృష్ణ మోహన్, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప, ధనుంజయ్, రోహిత్ రెడ్డికి అధికారులు నోటీసులు అందజేశారు.




ఎల్లుండి (ఆదివారం) ఉదయం 10 గంటలకు విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఏపీ లిక్కర్ స్కాం ఆరోపణల కేసుకు సంబంధించి సిట్ అధికారులు వివరాలు అందజేయాలని ఈడీ లేఖ రాసిన విషయం తెలిసిందే.

## ఏపీ హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘన..

# డిప్యూటీ కలెక్టర్‌కు సుప్రీంకోర్టు డిమోషన్

దిల్లీ: కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన అధికారికి సుప్రీం కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఆయన హోదాను తగ్గిస్తూ కీలక తీర్పును వెలువరించింది. డిప్యూటీ కలెక్టర్ తాతా మోహన్‌రావును ఎమ్మార్వోగా డిమోట్ చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో ఏపీ హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘించిన మోహన్ రావుపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ సీఎస్‌కు ఆదేశాలు ఇచ్చింది. అధికారులు చట్టానికి అతీతులమనే భావన తగదని ఈ సందర్భంగా జస్టిస్ గవాయి ధర్మాసనం వ్యాఖ్యానించింది.



గతంలో గుంటూరు తహసీల్దారుగా పనిచేసిన తాతా మోహన్ రావుకు గుంటూరులోని ఒక ప్రాంతంలో ఆక్రమణలను తొలగించవద్దని 2013 డిసెంబర్ 11న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, హైకోర్టు ఆదేశాలను ఆయన ఉల్లంఘించి 2014లో ఆక్రమణల్ని తొలగించారు. దీంతో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన మోహన్ రావుకు హైకోర్టు రెండు నెలలు జైలు శిక్ష విధించింది. హైకోర్టు తీర్పును ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన మోహన్‌రావుకు తహసీల్దార్‌గా డిమోషన్ కల్పిస్తూ ఆదేశాలు జారీచేసింది.

# మామిడి పండ్లు..
# ఈ అపోహాలు మీకూ ఉన్నాయా?



**వేసవి కాలంలో విరివిగా వచ్చే మామిడి పండ్లంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి! అయితే కొంతమంది మాత్రం ఈ పండు తింటే వేడి చేస్తుందని, ఇందులో అధిక చక్కెరలు, కొవ్వు పదార్థాలు ఉంటాయని.. వీటిని పూర్తిగా దూరం పెడతారు.. మరికొంతమంది తినాలనిపించినా ఆ కోరికను అదుపు చేసుకుంటూ చాలా మితంగా తింటుంటారు. మరి, నిజంగానే మామిడి పండు తింటే వేడి చేస్తుందా? వీటిలోని అధిక కొవ్వులు బరువు పెరిగేలా చేస్తాయా? ఇలా చాలామందిలో నెలకొన్న సందేహాలపై నిపుణులేమంటున్నారో తెలుసుకుందాం రండి..**



*** మామిడి పండు తింటే మొటిమలొస్తాయి..**

>>మామిడి పండ్లు వేడి చేస్తాయని, వాటిని తినడం వల్ల శరీరంలో వేడి పెరిగి.. ఫలితంగా మొటిమలొస్తాయని చాలామంది అనుకుంటారు. కానీ ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. ఇంకా చెప్పాలంటే వీటిలో పుష్కలంగా ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు.. వంటివన్నీ చర్మ ఆరోగ్యానికి మరింతగా దోహదం చేస్తాయంటున్నారు. అయితే ఇప్పటికే మొటిమలు, మచ్చలు వంటి చర్మ సమస్యలతో బాధపడే వారు వీటిని మరీ ఎక్కువగా తీసుకోకుండా మితంగా తినడం ఉత్తమం అని చెబుతున్నారు.



*** ఈ పండ్లు తింటే బరువు పెరుగుతాం..**

>>మామిడి పండ్లలో క్యాలరీలు, చక్కెరలు అధిక మొత్తంలో ఉండే మాట వాస్తవమే.. అలాగని దాని అర్థం బరువు పెరుగుతామని కాదు.. మితంగా తీసుకున్నంత వరకు ఈ పండ్లు మన శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చుతాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా 'ఎ', 'సి' విటమిన్లు.. ఐరన్, పొటాషియం, కాపర్, బయోయాక్టివ్ సమ్మేళనాలు.. వంటివన్నీ శరీరానికి తగిన మోతాదులో వీటి నుంచే అందుతాయట! కాబట్టి వీటిని పక్కన పెట్టి మామిడి పండ్లు తినాలన్న కోరికను చంపుకోకుండా.. మితంగా ఈ పండ్ల రుచిని ఆస్వాదించమంటున్నారు.



*** గర్భంతో ఉన్నప్పుడు వీటిని తీసుకోకూడదు..**

>>చాలామందికి ఉండే సందేహం ఇది. అయితే ఇందులోని పోషకాలు సాధారణ వ్యక్తులకు ఎంత అవసరమో.. గర్భిణులకూ అంతే అవసరం! అయితే ఇప్పటికే అధిక బరువు, జెస్టేషనల్ డయాబెటిస్‌తో బాధపడే గర్భిణులు వీటిని అమితంగా కాకుండా మితంగా.. అది కూడా పగటి పూట.. వైద్యుల సలహా మేరకు తీసుకోవడం మంచిది.

*** వేసవిలో మామిడి పండు మరింత వేడి చేస్తుంది..**

>>తీసుకునే ఆహారాన్ని జీర్ణం చేయడం, దాన్ని శక్తిగా మార్చడంలో జీర్ణ వ్యవస్థ ఎంత బిజీగా ఉంటే శరీరంలో అంత వేడి జనిస్తుందంటున్నారు నిపుణులు. అంటే వేళాపాళా లేకుండా ఎప్పుడూ ఏదో ఒకటి నమలడం, అమితంగా ఆహారం తీసుకోకూడదని దీన్ని బట్టి అర్థమవుతుంది. అంతేతప్ప మామిడి పండ్లు తినడానికి, శారీరక వేడికి సంబంధమే లేదంటున్నారు. అయితే వీటిని ఎక్కువగా తీసుకోకుండా ఉండడం ఉత్తమం అంటున్నారు. ఇంకా ఈ విషయంలో సందేహంగా ఉంటే.. మామిడి పండ్లను కాసేపు చల్లటి నీటిలో నానబెట్టి.. ఆపై తీసుకుంటే మంచిదని సలహా ఇస్తున్నారు.

*** ఈ పండ్లను ఫ్రిజ్‌లో పెట్టకూడదు..**

>>మామిడి పండ్లను పూర్తిగా పండిన తర్వాతే ఫ్రిజ్‌లో పెట్టమంటున్నారు నిపుణులు. అప్పుడే అవి మరింత రుచిగా ఉంటాయంటున్నారు. అలాగే ఈ పండ్లకు ఎంత గాలి తగిలితే అవి అంత తాజాగా, రుచిగా ఉంటాయట! కాబట్టి వీటిని ప్లాస్టిక్ కవర్లు, బ్యాగుల్లో అస్సలు నిల్వ చేయకూడదని, తద్వారా అవి త్వరగా పాడైపోతాయని చెబుతున్నారు.

# బరువు తగ్గడానికి 30-30-30 రూల్!



**అధిక బరువును తగ్గించుకొని ఫిట్‌గా మారడానికి ఒక్కొక్కరూ ఒక్కో ప్రయత్నం చేస్తుంటారు. డైటింగ్, చక్కటి పోషకాహారం తీసుకోవడం, వ్యాయామాలు చేయడం.. వంటివి చాలామంది చేసేవే! అయితే ఇవి కూడా ఎలా పడితే అలా కాకుండా బ్యాలన్స్‌డ్‌గా చేసినప్పుడే ఆశించిన ఫలితం దక్కుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే 30-30-30 రూల్ చక్కగా పని చేస్తుందంటున్నారు. మరి, ఇంతకీ ఏంటీ నియమం? బరువు తగ్గించడంలో ఇది ఎలా సహాయపడుతుంది? తెలుసుకుందాం రండి..**

### ఆ మూడూ ముఖ్యం!

బరువు తగ్గడమనేది ఇలా అనుకుంటే అలా పూర్తయ్యే పని కాదు.. ఇందుకు కొన్ని నెలలు లేదా ఏళ్లు పట్టచ్చు. అయితే అప్పటిదాకా ఆగే ఓపిక లేని వాళ్లు క్రాష్‌డైట్లు పాటిస్తూ, కఠినమైన వ్యాయామాలు చేస్తూ శరీరాన్ని ఇబ్బంది పెడుతుంటారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు తప్ప మరే ప్రయోజనం ఉండదు. ఇక మరికొంతమంది ఆహార నియమాలు లేదంటే వ్యాయామాలు.. ఈ రెండింట్లో ఏదో ఒకటి పాటిస్తూ బరువు తగ్గడానికి ప్రయత్నిస్తుంటారు. నిజానికి ఇలాంటి అసమతుల్యత వల్ల బరువు తగ్గకపోగా, ఆరోగ్యం పైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. అందుకే బరువు తగ్గాలంటే ఆహార నియమాలు, వ్యాయామం, ఎలా తింటున్నాం?.. ఈ మూడూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు. అది కూడా ఇవన్నీ బ్యాలన్స్‌డ్‌గా పాటించినప్పుడే.. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతామని, 303030 రూల్ ఉద్దేశం కూడా ఇదే అంటున్నారు.

### క్యాలరీలు తగ్గించాలి!

బరువు తగ్గాలంటే మనం తీసుకునే ఆహారంలోని క్యాలరీల శాతం కూడా ముఖ్యమే అంటున్నారు నిపుణులు. శరీరం మండించే స్థాయి కంటే ఎక్కువ క్యాలరీలు తీసుకోవడం వల్ల అవి కొవ్వుగా రూపాంతరం చెందుతాయి. ఇలా శరీరంలో అదనపు కొవ్వు పేరుకుపోయి క్రమంగా బరువు పెరిగే అవకాశాలుంటాయి. కాబట్టి బరువు తగ్గాలని లక్ష్యంగా పెట్టుకున్న వారు తమకు రోజువారీ కావాల్సిన క్యాలరీల కంటే 30 శాతం తగ్గించి తీసుకోవాలంటున్నారు నిపుణులు. సాధారణంగా మహిళలు రోజూ 2000 క్యాలరీల్ని తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో 30 శాతం తగ్గించి.. అంటే 1400 క్యాలరీలే తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల శక్తి కోసం శరీరం ఈ పాటికే పేరుకున్న కొవ్వుపై ఆధారపడుతుంది. తద్వారా కొవ్వు తగ్గి.. క్రమంగా బరువూ తగ్గుతాం. కాబట్టి 303030 రూల్‌లో భాగంగా.. 30 శాతం క్యాలరీలు తగ్గించి తీసుకోవడం మొదటి నియమం.

### అరగంట వ్యాయామం!

తీసుకునే ఆహారంలో క్యాలరీలు తగ్గిస్తే సరిపోదు.. ఒంట్లో అదనపు కొవ్వు నిల్వలు కరగాలంటే వ్యాయామం చేయడం కూడా ముఖ్యమే! అయితే కొంతమంది సమయం లేదనో, ఆహార నియమాలు పాటిస్తే సరిపోతుందనో ఎక్సర్‌సైజ్‌ను పక్కన పెట్టేస్తుంటారు. దీనివల్ల ఆశించిన ఫలితం దక్కదు. అందుకే 303030 రూల్‌లో భాగంగా రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామానికి సమయం కేటాయించడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. దీనివల్ల జీవక్రియల రేటు పెరిగి.. శరీరంలో కొవ్వులు సులభంగా కరిగిపోతాయంటున్నారు. కాబట్టి బరువు, శరీరాకృతిని బట్టి.. నడక, జాగింగ్, ఈత.. వంటి సులభమైన వ్యాయామాలతో మొదలుపెట్టి స్ట్రెంత్ ట్రైనింగ్, పుషప్స్, కార్డియో.. ఇలా కాస్త కఠినమైన వ్యాయామాల్ని సాధన చేయాలి. ఇక కార్డియో, ఏరోబిక్స్ కలిపి సాధన చేస్తే బరువు తగ్గడం సులభమవుతుంది.. కండర సామర్థ్యం పెరుగుతుంది. అలాగని అందరికీ అన్ని రకాల వ్యాయామాలు సరిపడచ్చు.. సరిపడకపోవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ శరీరతత్వానికి సరిపడే వ్యాయామాల్ని ఎంచుకోవడం వల్ల మరిన్ని సానుకూల ఫలితాల్ని పొందచ్చు.

### ఒంటికి పట్టేలా..!

తినేటప్పుడు టీవీ చూడడం, ఫోన్ చెక్ చేయడం, సోషల్ మీడియాలో చాటింగ్.. చాలామందికి అలవాటు! నిజానికి దీనివల్ల ఏకాగ్రత అంతా ఆయా గ్యాడ్జెట్స్ పైనే ఉంటుంది. ఫలితంగా ఎంత తింటున్నాం? కడుపు నిండిందా? అన్నది కూడా తెలియదు. ఇంకా ఆకలేస్తోందంటూ మోతాదుకు మించి ఆహారం లాగించేస్తుంటాం. బరువు పెరగడానికి/తగ్గకపోవడానికి ఇదీ ఓ కారణమే అంటున్నారు నిపుణులు. అందుకే తినేటప్పుడు ఏకాగ్రత అంతా మనం తీసుకునే ఆహారం పైనే పెట్టమంటున్నారు. ఈ క్రమంలో 30 నిమిషాల పాటు గ్యాడ్జెట్స్ అన్నీ పక్కన పెట్టి.. భోజనానికి సమయం కేటాయించమంటున్నారు. ఈ సమయంలో తీసుకునే ఆహారం రుచిని ఆస్వాదిస్తూ.. నెమ్మదిగా నములుతూ తినడం వల్ల.. ఆయా పదార్థాల్లోని పోషకాలు ఒంటికి పడతాయట! ఈ నియమం వల్ల మోతాదుకు మించి తినకుండా.. ఓ ముద్ద తక్కువగా తీసుకొని బరువును అదుపులో ఉంచుకోవచ్చంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ఇలా ఆహారాన్ని ఇష్టపడుతూ తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశాలు కూడా చాలా తక్కువని అధ్యయనాలు చెబుతున్నాయి.

# సరిహద్దుల్లో ఉద్రిక్తతలు..
# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..!



**ముంబై:** భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో శుక్రవారం స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. జమ్మూ, పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌లపై దాడికి విఫల ప్రయత్నాలను భారత్ విజయవంతంగా తిప్పికొట్టింది. ఈ క్రమంలో శుక్రవారం మార్కెట్లు భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. గత సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 78,968.34 వద్ద నష్టాల్లో మొదలైంది. సెన్సెక్స్ ప్రారంభంలోనే 400 పాయింట్లు పతనమైంది. ప్రస్తుతం సెన్సెక్స్ 800 పాయింట్ల నష్టంతో 79,533.84 పాయింట్ల వద్ద కొనసాగుతున్నది. మరో వైపు నిఫ్టీ 260.8 పాయింట్లు తగ్గి 24,013 పాయింట్ల వద్ద కదలాడుతున్నది. మార్కెట్‌లో దాదాపు 555 షేర్లు లాభపడగా.. 2618 షేర్లు నష్టపోయాయి. మరో 109 షేర్లు మాత్రం మారలేదు.

నిఫ్టీలో టైటాన్, లార్సెన్, భారత్ ఎలక్ట్రికల్, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్, ఎస్‌బీఐ, ఏషియన్ పేయింట్స్, ఓఎన్‌జీసీ, విప్రో లాభపడ్డాయి. జియో ఫైనాన్షియల్, ట్రెంట్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్, గ్రాసిమ్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత లాభం 25 శాతం పెరిగి రూ.5,497 కోట్లకు చేరుకున్నట్లు లార్సెన్ అండ్ టూబ్రో నివేదించిన తర్వాత 4 శాతానికిపైగా పెరిగింది. టైటాన్ కంపెనీ కూడా 4 శాతానికి పైగా పెరిగింది. మార్చి త్రైమాసికంలో టాటా గ్రూప్ సంస్థ ఏకీకృత లాభంలో 13 శాతం పెరిగినట్లు తెలిపింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు గురువారం రూ.2,007.96 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారని ఎక్స్ఛేంజ్ డేటా తెలిపింది.

## మళ్లీ షాకిచ్చిన బంగారం..

**ఒక్కరోజులోనే భారీగా పెరిగిన ధరలు..**



**న్యూఢిల్లీ:** బంగారం ధరలు మళ్లీ షాకిస్తున్నారు. గత నాలుగు రోజుల క్రితం నెమ్మదిగా తగ్గుతూ వచ్చిన పసిడి.. ఇప్పుడు ఊహించని విధంగా పెరిగింది. నిన్న ఒక్క గోల్డ్ రేట్స్ లో మార్పులు జరగ్గా.. ఈరోజు అంటే శుక్రవారం ఉదయం స్వల్పంగా పెరిగాయి. దేశీయ మార్కెట్లో శుక్రవారం ఉదయం 7 గంటల సమయానికి 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ. 99,610కు చేరింది. దీంతో అటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరలలో మార్పులు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లోనూ పసిడి ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,610కు చేరింది. అలాగే విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, నిజామాబాద్ వంటి ప్రాంతాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.91,460 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.99,610కు చేరింది. అలాగే ముంబైలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రూ.91,310 చేరగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,760కు చేరింది. ఇక బెంగుళూరులో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,610 వద్ద కొనసాగుతుంది. అలాగే చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రూ.91,310కు చేరగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.99,610కు చేరింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,10,900.

## వ్యాపారంలో విజయానికి పంచతంత్రం..

**వారెన్ బఫెట్ చెప్పిన ఐదు సూత్రాలు**

**న్యూఢిల్లీ:** మన కళ్ల ముందే విజయాలు సాధించిన వ్యక్తులు మనకు ఆదర్శంగా నిలుస్తారు. వారిలో అమెరికాకు చెందిన వ్యాపారవేత్త వారెన్ బఫెట్ ఒకరు. ఆయన పెట్టుబడి దారుడు, పరోపకారి, బెర్క్ షైర్ హాత్ వే కంపెనీ చైర్మన్. ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో ఒకరు. మంచి పెట్టుబడులు పెట్టాలంటే తెలుసుకోవాల్సిన ఐదు విషయాలను ఆయన వెల్లడించారు. ఆ విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

### డబ్బును పోగొట్టుకోకూడదు

మూలధనాన్ని రక్షించుకోవడం పెట్టుబడిదారుల ప్రధాన బాధ్యతని బఫెట్ తెలిపారు. డబ్బును పోగొట్టుకుంటే మీరు రేసులో వెనుకబడిపోతారు. దాని నుంచి కోలుకోవడం కష్టంగా మారుతుంది. ఒక స్టాక్ లో 50 శాతం నష్టపోతే, మరో దానిలో లాభాలు సంపాదించాలి. ముఖ్యంగా పెట్టుబడిలో నష్టాలను నివారించడానికి కష్టబడి పనిచేయడమే సరైన మార్గమని ఆయన నమ్మకం.



### కంపెనీల కొనుగోలు

ఎక్కువ డబ్బులు పెట్టి ఒక మంచి కంపెనీని కొనడం కంటే, తక్కువ డబ్బులతో మధ్యస్త కంపెనీ కొనడం ఉత్తమమని బఫెట్ చెబుతారు. దీని వల్ల తక్కువ ధరకు నాణ్యత కలిగిన కంపెనీలో పెట్టుబడి పెట్టే అవకాశం కలుగుతుంది. ఇది వ్యాపార రంగంలో పెద్ద మార్పును తీసుకువస్తుంది. దీర్ఘకాలంలో లాభాల బాటలో పయనించే అవకాశం కలుగుతుంది.

### భావోద్వేగాలు

భావోద్వేగాలను దూరంగా ఉండడం పెట్టుబడి దారుడి ప్రధాన లక్షణం. దీనినే బఫెట్ వ్యతిరేక పెట్టుబడి కళగా అభివర్ణించారు. మార్కెట్ బాగున్నప్పుడు ధరలు పెరుగుతాయి. దీని వల్ల నష్టాలు కలుగుతాయి. అయితే భయాందోళనలు తలెత్తినప్పుడు స్టాక్ ల ధరల తగ్గే అవకాశం ఉంది. ఆ సమయంలో మంచి డీల్ లను అందుకోవచ్చు.

### ఓర్పు

పెట్టుబడిదారుడికి ఓర్పు అనేది ఛ్చాలా అవసరం. పెట్టుబడి పెట్టిన వెంటనే లాభాల కోసం ఆలోచించడం సరి కాదు. మంచి కంపెనీలో ఏళ్ల తరబడి డబ్బులను నిల్వ ఉంచాలి. అసహనంగా ఉండే వారు తరచూ అధిక ధరలకు స్టాక్ లను కొనుగోలు చేసి, మార్కెట్లు పెరిగినప్పుడు తక్కువ ధరకు అమ్మేస్తారు. తద్వారా ఓపికతో వేచి ఉండే ఇన్వెస్టర్లు లాభాలు పొందుతారు.

### కొత్త మార్గాలు

డబ్బులను సంపాదించడానికి నిరంతరం కొత్త మార్గాలను అన్వేషించాలి. ఒక రకంగా చెప్పాలంటే నిద్ర పోతున్నప్పుడు కూడా డబ్బు సంపాదించడానికి మార్గం ఆలోచించాలి. లేకపోతే మీరు చనిపోయే వరకూ పని చేస్తూనే ఉంటారని వారెన్ బఫెట్ చెప్పారు. అంటే స్టాక్ లు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్స్ లో డబ్బులను ఇన్వెస్ట్ చేయాలి. మీరు నిద్రపోతున్నప్పుడు కూడా అవి పెరుగుతూనే ఉంటాయి. కొత్త మార్గాలను అన్వేషించడం పెట్టుబడి దారుడికి చాలా అవసరం.



# ఐపీఎల్‌కు వారం రోజులు బ్రేక్..

**త్వరలోనే**

**కొత్త షెడ్యూల్ ప్రకటన..!**



**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల ప్రభావం ఐపీఎల్ 18వ సీజన్‌పై పడింది. ఆటగాళ్ల భద్రత దృష్ట్యా గురువారం ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ అర్ధాంతరంగా ఆపేసిన బీసీసీఐ.. మెగా టోర్నీని నిరవధికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే.. శుక్రవారం మధ్యాహ్నం మరో ప్రకటనలో వారం రోజుల పాటు ఐపీఎల్ మ్యాచ్‌లకు బ్రేక్ ఇస్తున్నట్టు బీసీసీఐ వివరించింది. అనంతరం పరిస్థితులను బట్టి.. ప్రభుత్వ ఆదేశాలను బట్టి లీగ్ కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించాడు.

ధర్మశాలలో పంజాబ్, ఢిల్లీ మ్యాచ్‌ను రద్దు చేసిన బీసీసీఐ ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఐపీఎల్‌ను వారం పాటు వాయిదా వేసింది. అప్పటికీ సాధారణ పరిస్థితులు నెలకొనకుంటే ఫ్రాంఛైజీ యజమానులతో మాట్లాడి టోర్నీ నిర్వహణపై ఓ నిర్ణయానికి రానుంది బీసీసీఐ. ప్రస్తుతానికైతే ఐపీఎల్ 18వ సీజన్‌ను వారం రోజులకు వాయిదా వేశాం. బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్, ఐపీఎల్ జట్ల యజమానులతో మాట్లాడాకే ఈ నిర్ణయం తీసుకున్నాం.

ఆ తర్వాత మిగతా 16 మ్యాచ్‌ల షెడ్యూల్‌పై త్వరలోనే ప్రకటన వెలువరిస్తాం. ఫ్రాంఛైజీ యజమానులు, బ్రాడ్‌కాస్టింగ్, స్పాన్సర్‌షిప్ సంస్థలతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం. మాకు భారత సైన్యంపై పూర్తి విశ్వాసం ఉంది. అయితే.. అందరి భద్రతను దృష్టిలో పెట్టుకొని ఐపీఎల్ మ్యాచ్‌లను వారానికి వాయిదా వేశాం అని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు.

### ఎలాంటి ఆదేశాలు రాలేదు

ఐపీఎల్ వాయిదా గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని ఛైర్మన్ అరుణ్ ధుమాల్ చెప్పాడు. 'ఆపరేషన్ సిందూర్ తర్వాత దేశ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులను గమనిస్తున్నాం. పరిస్థితులు కాస్త ఉద్రిక్తంగానే ఉన్నాయి. కానీ ఇప్పటివరకూ మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయితే.. ఆటగాళ్లు, సహాయక సిబ్బందిని తరలించడం కష్టమైన పని. అందుకే.. ఐపీఎల్ ఫ్రాంఛైజీలు, మీడియా, బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకుంటాం' అని అరుణ్ వెల్లడించాడు.

# శ్రీకాంత్‌కు షాక్..
# సెమీఫైనల్లో యువ షట్లర్లు



**న్యూఢిల్లీ:** తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువషట్లర్లు అదరగొట్టారు. ఆయుష్ శెట్టి, ఉన్నాతి హుడాలు తమ తమ విభాగాల్లో అద్భుత విజయంతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. తద్వారా పతకానికి అడుగు దూరంలో నిలిచారిద్దరు. 20 ఏళ్ల ఆయుష్ సంచలన ఆటతో సీనియర్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌కు చెక్ పెట్టడం గమనార్హం. శుక్రవారం మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో హుంగ్ యీ టింగ్ కడదాకా పోరాడినా ఉన్నాతి ధాటికి చేతులెత్తేసింది.

తొలి రౌండ్ నుంచి దూకుడుగా ఆడుతున్న ఉన్నాతి క్వార్టర్స్‌లోనూ చెలరేగింది. స్థానిక క్రీడాకారిణి అయిన హుంగ్‌కు ముచ్చెమటలు పట్టించింది. 52 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో భారత షట్లర్ 21-8, 19-21, 21-19తో జయభేరి మోగించింది. తదుపరి రౌండ్‌లో ఈ 17 ఏళ్ల సంచలనం జపాన్‌కు చెందిన తొమొకా మియజకీని ఢీ కొట్టనుంది.

### శ్రీకాంత్‌కు ఝలక్

పురుషుల సింగిల్స్‌లో 20 ఏళ్ల ఆయుశ్ అద్భుతమై చేశాడనాలి. అతడు ఏకంగా భారత సీనియర్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌ను ఇంటికి పంపాడు. తొలి సెట్ నుంచే శ్రీకాంత్‌పై ఆధిపత్యం చెలాయించిన ఆయుష్.. 21-16, 15-21, 21-17తో మ్యాచ్ గెలుచుకున్నాడు. సెమీస్‌లో ఈ యంగ్‌స్టర్‌కు కఠిన సవాల్ ఎదురుకానుంది. చౌ థియెన్ చెన్(చైనీస్ తైపీ), మోహ్ జకీ ఉబైదిల్లాహ్(ఇండోనేషియా) మ్యాచ్ విజేతతో అతడు తలపడనున్నాడు.

# సఫారీలకు కొత్త కోచ్

**మూడు ఫార్మాట్లకూ ఒక్కడే..!**

**జోహన్నస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా పురుషుల జట్టుకు గుడ్‌న్యూస్. మూడు ఫార్మాట్లకు బోర్డు కొత్త కోచ్‌ను నియమించింది. మాజీ ఆటగాడైన శుక్రి కొన్రాడ్‌ను కోచ్‌గా బాధ్యతలు అప్పగించింది సీఎస్. ఈ విషయాన్ని సఫారీ బోర్డు శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. వైట్ బాల్ కోచ్‌గా ఉన్న రాబ్ వాల్టర్ ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజీనామా చేశాడు. దాంతో, అతడి స్థానాన్ని కొన్రాడ్‌తో భర్తీ చేసింది సఫారీ బోర్డు.

ఇప్పటివరకూ సుదీర్ఘ ఫార్మాట్‌లో మాత్రమే సలహాలు సూచనలు ఇచ్చిన శుక్రి ఇకపై వన్డే, టీ20 జట్లకు కూడా మార్గనిర్దేశనం చేయనున్నాడు. మూడు ఫార్మాట్లకు కోచ్‌గా ఎంపికవ్వడం పట్ల కొన్రాడ్ సంతోషం వ్యక్తం చేశాడు. 'నా క్రికెట్ ప్రయాణంలో టెస్టు జట్టుకు కోచింగ్ ఇవ్వడం నిజంగా గొప్ప గౌరవం.

ఇప్పుడు వన్డే, టీ20 జట్ల బాధ్యతలు చూడాల్సి రావడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది. కొత్త సవాళ్లను స్వీకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. దక్షిణాఫ్రికాకు వైట్ బాల్ క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారు. సీనియర్ ప్లేయర్ల నుంచి జూనియర్ల వరకూ.. సఫారీ జెర్సీ వేసుకునేందుకు ఆరాటపడుతున్నారు. ఆ దిశగా బలమైన పునాది వేసేందుకు నేను కృషి చేస్తాను.ప్రస్తుతం మాకు బిజీ షెడ్యూల్ ఉంది. డబ్ల్యూటీసీ ఫైనల్.. ఆ తర్వాత టీ20 వరల్డ్ కప్ పోటీలపై దృష్టి పెడుతున్నాం' అని 58 ఏళ్ల కొన్రాడ్ వెల్లడించాడు.



వన్డే వరల్డ్ కప్ వరకూ కొన్రాడ్ 2023 జనవరి నుంచి టెస్టు జట్టుకు కోచ్‌గా పని చేస్తున్నాడు. జూలైలో జరుగబోయే ముక్కోణపు టీ20 సిరీస్‌లో అతడికి పొట్టి క్రికెట్ సవాల్ ఎదురుకానుంది. ఈ ట్రై సిరీస్‌లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, న్యూజిలాండ్ తలపడనున్నాయి. స్వదేశంలో 2027 జరుగబోయే వన్డే వరల్డ్ కప్ వరకూ కొన్రాడ్ కోచ్‌గా సేవలు అందించనున్నాడు. ఈ మెగా టోర్నీకి జింబాబ్వే, నమీబియాలు ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే.

# పాకిస్థాన్‌కు మరో షాక్..

**క్రికెట్ మ్యాచ్‌లకు అనుమతివ్వని యూఏఈ..!**

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌కు వరుసగా షాక్‌లు తలుగుతున్నాయి. భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'తో ఉగ్రస్థావరాలు నేలమట్టం కాగా.. 400లకు పైగా డ్రోన్లు తునాతునకలయ్యాయి. ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ఊహించని ఝలక్ ఇచ్చింది. పాకిస్థాన్ సూపర్ లీగ్ మ్యాచ్‌లను తమ దేశంలో నిర్వహించేందుకు ఆసక్తి చూపిండం లేదు.

భారత్‌తో ఉద్రిక్తతల నడుమ తాము పాక్ బోర్డు విన్నపాన్ని తోసిపుచ్చేందుకు ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు సిద్ధమైంది. దాంతో, ఏమి చేయాలో పాలుపోక పీసీబీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో పాక్ ఉలిక్కి పడింది. అత్యాధునిక ఆయుధాలతో ఇండియన్ సైన్యం చేస్తున్న దాడులకు జడిసిన దాయాది దేశం.. పీఎస్ఎల్‌ను యూఏఈకి తలరించాలని అనుకుంది. ఇదే విషయమైన ఎమిరేట్స్ క్రికెటర్ల యూఐఈ వేదికగా తరలించాలని భావించింది.




కానీ, ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు మాత్రం అందుకు ససేమిరా అంటోంది. ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న ఈ సమయంలో తాము పీఎస్ఎల్‌కు ఆతిథ్యం ఇవ్వడం సరికాదని యూఏఈ ప్రభుత్వం భావిస్తోంది. ఒకవేళ పీసీబీ ప్రతిపాదనకు అంగీకరిస్తే.. కొన్నాళ్లుగా భారత క్రికెట్ నియంత్రణ మండలితో తమకున్న సఖ్యత ఎక్కడ దెబ్బతింటుందేమోనని అరబ్ దేశం ఆలోచిస్తోంది.

### బీసీసీఐతో సత్సంబంధాలు

'గత కొంత కాలంగా ఎమిరేట్స్ క్రికెట్ బోర్డుకు బీసీసీఐతో సత్సంబంధాలు ఉన్నాయి. 2021లో టీ20 వరల్డ్ కప్‌తో పాటు ఐపీఎల్ మ్యాచ్‌లు ఇక్కడ జరిగాయి. ఈమధ్యే ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఇక్కడే ఆడింది. అందుకే.. మాకు బీసీసీఐతో స్నేహం చెడడం ఇష్టం లేద'ని ఎమిరేట్స్ బోర్డు ప్రతినిధులు అంటున్నారు. పైగా.. ఐసీసీ ప్రధాన కార్యాలయం దుబాయ్‌లో ఉంది. బీసీసీఐకి సెక్రటరీగా సేవలందించిన జై షా ప్రస్తుతం ఐసీసీ ఛైర్మన్‌గా ఉన్నాడు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఆ దేశ బోర్డు.. పీఎస్ఎల్ మ్యాచ్‌లకు నో చెబుతోంది.



# లక్కీ ఛాన్స్ కొట్టేసిన శ్రీలీల

టాకీస్: కిసిక్ అంటూ టీటౌన్‌లో కాదు బాలీవుడ్‌లోనూ క్రేజ్ తెచ్చుకుంది డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల. ఒక్క పాటతో నార్త్ ఆడియన్స్‌ను ఫిదా చేసింది. అంతకు ముందు సుమారు డజన్ సినిమాలు చేసినా రాని ఐడెంటిటీ- పుష్ప2 స్పెషల్ సాంగ్‌తో తెచ్చుకుంది. ఈ మధ్య కాలంలో సౌత్‌లో కాస్త క్లిక్ అయితే చాలు ఇక్కడి ముద్దుగుమ్మలకు నార్త్ వెంటనే రెడ్ కార్పెట్ వేస్తోంది. అలా శ్రీలీలకు ఛాన్స్ ఇచ్చింది. బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తోంది. దీనికి ఆషికి 3 అనే -టైటిల్ పరిశీలనలో ఉంది. అనురాగ్ బసు దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాని దీపావళికి రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమా రిజల్ట్ తేలకుండానే మరో ఛాన్స్ కొట్టేసిందట శ్రీలీల. యంగ్ హీరో సిద్దార్థ్ మల్హోత్రా సరసన జోడీ కడుతోంది. దర్శకుడు రాజ్ సాండియాలా నెక్స్ట్ ఫిల్మ్‌లో కమిటైనట్లు తెలుస్తోంది. ఆనంద్ ఎల్ రాయ్ సినిమాను నిర్మిస్తున్నట్లు టాక్. త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కబోతుందని సమాచారం. బాలీవుడ్‌లో ఈ క్రేజీ ఆఫర్లు చూస్తుంటే మేడమ్ ఫేట్‌ను వాళ్ళు ఏ మాత్రం పట్టించుకోనట్లే కనిపిస్తోంది. తెలుగులో ఇప్పటి వరకు తొమ్మిది సినిమాలు చేస్తే నాలుగు మాత్రమే సూపర్ హిట్స్. అందులో ఒకటి స్పెషల్ సాంగ్. మిగిలినవన్నీ ఫ్లాప్సే. అయినప్పటికీ ఇప్పటికీ ఆఫర్లు కొల్లగొడుతూనే ఉంది. మాస్ జాతర, లెనిన్ లైన్ లో ఉన్నాయి. చరణ్ పెద్దిలో స్పెషల్ సాంగ్ చేయబోతున్నట్లు- టాక్. ఇవేకాదు తమిళంలో పరాశక్తితో ఎంట్రీ ఇవ్వబోతుంది. శ్రీ లీల కెరీర్ లో భయకంరమైన ఫ్లాప్స్ ఉన్నా బాలీవుడ్ పిలిచి మరి ఆఫర్స్ ఇస్తోంది.



# సరదా..సరదాగా సాగిన ట్రయాంగిల్ లవ్ మూవీ..సింగిల్

టాకీస్: శ్రీవిష్ణు.. వరుస సినిమాలతో దూసుకెళు_న్నాడు. గతేడాది ఓం భీమ్ బుష్, శ్వాగ్ చిత్రాలతో రెండు సూపర్ హిట్లను తన ఖాతాలో వేసుకున్న శ్రీవిష్ణు.. ఇప్పుడు సింగిల్' అంటూ ప్రేక్షకుల ముందకు వచ్చాడు. ఈ చిత్రంలో కేతిక శర్మ హీరోయిన్‌గా నటించగా, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. . ఇప్పటికే విడుదలైన టీజర్ - ట్రైలర్ పాటలు సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి.దానికి తోడు ప్రమోషన్స్ కూడా గట్టిగా చేయడంతో 'సింగిల్'పై హైప్ క్రియేట్ అయింది. భారీ అంచనాల మధ్య శుక్రవారం ప్రేక్షకుల ముందకు వచ్చింది. ఇదొక ట్రయాంగిల్ లవ్‌స్టోరీ. విజయ్ ఓ బ్యాంక్‌లో పని చేస్తుంటాడు. 30 ఏళ్లు దాటినా సింగిల్‌గానే ఉంటాడు. తన జీవితంలోకి కూడా ఒక అమ్మాయి రావాలని ప్రతి రోజు ఆ దేవుడిని కోరుకుంటాడు. ఓ సారి మెట్రో ట్రైన్‌లో పూర్వ(కేతికా శర్మ)ను చూసి ప్రేమలో పడిపోతాడు. ఆమెను ఇంప్రెస్ చేయడానికి స్నేహితుడు అరవింద్(వెన్నెల కిశోర్)తో కలిసి రకరకాల ప్లాన్ వేస్తాడు. ఇదే సమయంలో విజయ్ లైఫ్‌లోకి హరిణి(ఇవానా) వస్తుంది. పూర్వని ప్రేమలో పడేయడానికి విజయ్ ఏంఏం పనులో చేస్తాడో.. హరిణి కూడా కూడా అలానే చేస్తుంది. అసలు హరిణి ఎవరు? విజయ్ ఛీ కొట్టినా అతని వెనకాలే ఎందుకు తిరిగింది? చివరకు విజయ్ ప్రేమను పూర్వ అంగీకరించిందా? లేదా హరిణి ప్రేమలో విజయ్ పడిపోయాడా? లేదంటే మళ్లీ విజయ్ సింగిల్‌గానే మిలిగిపోయాడా? అన్నదే కథ. హీరో ఒక హీరోయిన్‌ని ప్రేమించడం, మరో హీరోయిన్ అతన్ని ప్రేమించడం.. చివరకు ఈ విషయం ముగ్గురికి తెలిసి.. ఒకరు త్యాగం చేసి మరొకరు హీరోని పెళ్లి చేసుకోవడం.. ట్రయాంగిల్ లవ్‌స్టోరీలు అన్ని ఇలానే ఉంటాయి. దర్శకుడు కార్తీక్ రాజు రాసుకున్న స్టోరీ కూడా ఇలానే ఉంటుంది కానీ క్లైమాక్స్‌లో ఆయన ఇచ్చిన ట్విస్ట్ కొత్తగా ఉంటుంది. ముగింపు డిఫరెంట్‌గా ప్లాన్ చేశాడు. కథ పరంగా చూస్తే ఇదొక్కటే కొత్త పాయింట్. మిగతాదంతా రొటీన్, రెగ్యులర్ స్టోరీ. కానీ దర్శకుడు దానికి ఇచ్చిన ట్రీ-ట్‌మెంట్ , రాసుకున్న స్క్రీన్‌ప్లే సినిమాను కాపాడాయి. తెలిసిన కథే అయినా తెరపై శ్రీవిష్ణు వేసే పంచ్ డైలాగులకు, వెన్నెల కిశోర్ ఇచ్చే ఎక్స్‌ప్రెషన్స్ ఫుల్ ఎంటర్టైన్‌మెంట్‌ని అందిస్తాయి. ఎలాంటి సాగదీతలు లేకుండా సినిమా ప్రారంభంలోనే ట్రైయాంగిల్ ప్రేమకథను మొదలు పెట్టాడు దర్శకుడు.

# మావారికి నేను హీరోయిన్ అని తెలీదు

**అసలు విషయం చెప్పిన నటి అమలాపాల్**

టాకీస్: కొంతమంది హీరోయిన్లు తక్కువ సినిమాలే చేసిన కూడా ప్రేక్షకుల్లో బాగా గుర్తుండి పోతారు. అందులో మలయాళం కుట్టి అమలాపాల్ ఒకరు. తెలుగులో అల్లు అర్జున్ తో 'ఇద్దరమ్మాయిలతో', రామ్‌చరణ్ 'నాయక్' , నాగ చైతన్యతో 'బెజవాడ', నాని 'జెండాపై కపిరాజు' వంటి మంచి సినిమాలతో పేరు తెచ్చుకున్న ఈ అమ్మడు, ఎందుకనో ఆ తర్వాత సరైన అవకాశాలు లేక తెలుగుకు దూరమైంది. అప్పటివరకు డీసెంట్ చిత్రాలే చేసుకుంటూ వచ్చిన అమ్మడు ఆ తర్వాత తన స్టైల్‌ను పూర్తిగా మార్చేసి, బోల్డ్ సినిమాలు చేయడం ప్రారంభించింది. ఈ క్రమంలో 'ఆమె' అనే సినిమాలో నగ్నంగా కూడా నటించి అందరికీ షాక్ ఇచ్చింది. అదే వరుసలో వెబ్ సీరిస్‌లు చేస్తూ లిప్‌లాక్‌లతోనూ రెచ్చి పోయింది. ఇక కెరీర్ విషయం పక్కన పెడితే.. 2014లో తమిళ దర్శకుడు ఎల్. విజయ్‌ను ప్రేమించి వివాహం చేసుకున్న అమల పాల్ 2017లో విడాకులు తీసుకుని సింగిల్‌గానే ఉంది. తర్వాత చాలా కాలం ఒంటరిగా ఉన్న అమలాపాల్ తన పుట్టినరోజు వేడుకలో, ఓ స్నేహితుడు ప్రపోజ్ చేయగా ఆమె ఓకే చెబుతూ.. అతనిని ముద్దులతో ముంచేసింది. అది జరిగిన వారం రోజులలోపే వివాహం కూడా చేసుకుని ఒక్కటయ్యారు. వెంటనే గుడ్ న్యూస్ కూడా చెప్పిన ఈ అమ్మడు పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే తాజాగా ఒక అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న అమలాపాల్ తన భర్త కు సంబంధించిన విషయాలు మీడియాతో పంచుకుంది. ఆమె మాట్లాడుతూ.. ' మేము ఇద్దరం గోవాలో కలిశాం. జగత్ గుజరాతీ అయినప్పటికీ అక్కడే ఉంటున్నారు. నేను కేవలం కేరళకు చెందిన అమ్మాయినని మాత్రమే అని అతనికి చెప్పాను. అతను ఎక్కువగా దక్షిణాది సినిమాలు చూడడు. నేను నటినని కూడా అతనికి చెప్పలేదు. కేవలం నా వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను మాత్రమే అతనికి చూపించాను.



# అట్లీ-బన్నీ మూవీలో మరో కొత్త పేరు

**శ్రీనిధిశెట్టి హీరోయిన్ అంటూ వార్తలు**

టాకీస్: తమిళ దర్శకుడు అట్లీతో అల్లు అర్జున్ 22వ చిత్రం లాక్ అయిన విషయం తెలిసిందే. సన్ పిక్చర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని, భారీ బడ్జెట్‌తో హై వీఎఫ్ఎక్స్ టెక్నాలజీని వాడుకుంటూ ఊహించని విధంగా తెరకెక్కించబోతున్నారు. అయితే ఇలాంటి సినిమాలో హీరోయిన్‌ని సెలక్ట్ చేయడం అంటే ఛాలెంజింగ్ అనే చెప్పాలి. అందుకే ఇప్పటి వరకు ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారని ప్రచారం జరుగుతుంది. ఇందులో భాగంగా చాలా మంది బ్యూటీల పేర్లు తెరపైకి వచ్చాయి. దీపికా



పదుకొనే, శ్రద్ధా కపూర్, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, అనన్య పాండే, సమంత పేర్లు తెరపైకి రాగా. వీళ్లలో ముగ్గురు భామలు ఎవరు అవుతారన్నది ఆసక్తికరంగా మారింది. కానీ అందరూ ఎక్కువగా సామ్‌కే ఓటేశారు కానీ. తన 'శుభం' మూవీ ప్రమోషన్స్ దీని పై క్లారిటీ ఇచ్చింది. తాజాగా కన్నడ బ్యూటీ- శ్రీనిధి శెట్టి పేరు తెరపైకి వస్తుంది. ఇందులో అల్లు అర్జుకి మెయిన్ లీడ్ గా ఈ భామనే తీసుకుంటున్నారనే కొత్త వార్తలు వెలుగులోకి వచ్చాయి. అట్లీ రాసిన పాత్రకు శ్రీనిధి పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుందని అందుకే తొలి అవకాశం ఆమెకే ఇస్తున్నట్లు- కోలీవుడ్ టాక్. ఇక రీసెంట్ గా 'హిట్ 3'లో ఈ అమ్మడు యాక్టింగ్ కు మంచి మార్కులు పడగా, గ్లామర్ పరంగా కూడా బాగానే ఆకట్టుకుంది. మరి బన్నీ మూవీలో ఈ శ్రీనిధి శెట్టి.. ఎంతవరకు నిజమో తెలియాల్సి ఉంది.

# సరిహద్దుల్లో ఉద్రిక్తతలు థగ్‌లైఫ్ ఆడియో రిలీజ్ ప్రోగ్రామ్ రద్దు




టాకీస్: కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'థగ్ లైఫ్' భారీ తారాగణంతో పాన్ ఇండియా స్థాయిలో సిద్ధమవుతోంది. జూన్‌లో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఈ నెలలో భారీస్థాయిలో ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించాలని టీమ్ భావించింది. ఈవెంట్ కోసం మే 16న ముహూర్తం కూడా ఫిక్స్ చేసింది. కానీ, ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న టీమ్ ఆడియో రిలీజ్‌ను క్యాన్సిల్ చేసింది. త్వరలోనే కొత్త ఆడియో రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని తెలిపింది. దేశ సరిహద్దుల్లో ఏర్పడిన పరిస్థితుల రీత్యా మే 16న జరగనున్న 'థగ్ లైఫ్' ఆడియో రిలీజ్‌ను వాయిదా వేయాలని మేము భావిస్తున్నాం. మన మాతృభూమి పరిరక్షణలో సైనికులు ఎంతగానో పోరాడుతోన్న వేళ ఇది వేడుకలకు సమయం కాదని నమ్ముతున్నాం. సైనికులకు మా మద్దతు తెలియ జేస్తున్నాం. దేశ పౌరులుగా ఇది మా బాధ్యతని కమల్‌హాసన్ ప్రకటన విడుదల చేశారు. ఈవెంట్‌కు సంబంధించి కొత్త డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన చెప్పారు. నాయకన్' (1987) లాంటి హిట్ తర్వాత కమల్ - మణిరత్నం కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రమిది. గ్యాంగ్‌స్టర్, యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కమల్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టు-కున్నాయి. జూన్ 5న ఈ సినిమా విడుదల కానుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.